E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 28-02-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:58|| పేజీలు–6 www.ekaburu.com



ఆత్మతగా తవ్వేశారు...
పట్టించుకోకుండా వదిలేశారు...

....(3లో)



పేదల ఇళ్లు కట్టాల్సింది పోయి..
**కూల్చడంలో పోటీ పడతారా?** 02



పవన్ కల్యాణ్ నాకు
**జీవితాంతం పెద్దన్నే**
..మంత్రి నారా లోకేశ్ 02



ఓవైసీ కాలేజీని
**హైడ్రా ఎందుకు కూల్చదు?** 03



'యాదాద్రి' ఆలయనగరి
**ఇంకెప్పుడో?** 03

## కేజ్రీవాల్, కవితకు క్లీన్‌చిట్



### కవితకు భారీ ఊరట



- మనీశ్ సిసోదియా, మరో 20 మందికి కూడా విముక్తి
- దిల్లీ మద్యం కేసులో రౌజ్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు
- సీబీఐ అభియోగాలు నిరాధారమంటూ కొట్టివేత
- అవి న్యాయ పరిశీలనకు నిలవలేదని స్పష్టీకరణ
- కోర్టు వెలుపల కన్నీటి పర్యంతమైన ఆప్ అగ్రనేత
- ప్రత్యేక జడ్జి తీర్పును హైకోర్టులో సవాల్ చేసిన దర్యాప్తు సంస్థ

దిల్లీ మద్యం కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై సీబీఐ అభియోగాలు నిరాధారంగా ఉన్నాయని దిల్లీ కోర్టు కొట్టివేయడంతో ఆమెకు భారీ ఊరట లభించింది. కవిత అరెస్టు నుంచీ జరిగిన పరిణామాలు అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశాలయ్యాయి. సీబీఐ అధికారులు తొలుత 2022 డిసెంబరులో హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేశారు. అనంతరం.. మద్యం కేసులో కవిత తరఫున కార్యకలాపాలు సాగించారంటూ హైదరాబాద్‌కు చెందిన పలువురిని కేంద్ర దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేశాయి. ఈడీ అధికారులు 2024 మార్చి 15న కవితను అరెస్ట్ చేసి దిల్లీలోని తిహాడ్ జైలుకు తరలించారు. ఆమె జైల్లో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ అరెస్ట్ చేసింది. సుమారు 5 నెలల జైలు జీవితం అనంతరం.. అదే ఏడాది ఆగస్టు 27న ఆమె బెయిల్‌పై విడుదలయ్యారు.

**ఈ-కబురు, దిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దిల్లీ మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అగ్రనేతలు అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. వారితో పాటు మరో 20 మందిపై నమోదైన అభియోగాలను దిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు శుక్రవారం కొట్టివేసింది. వారందరికీ కేసు నుంచి విముక్తి కల్పించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా ఉద్దేశపూర్వకంగా కేసులో ఇరికించారని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)పై మండిపడింది. అయితే ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ సీబీఐ వెంటనే దిల్లీ హైకోర్టులో అప్పీలు దాఖలు చేసింది. దర్యాప్తులోని పలు అంశాలను న్యాయస్థానం పరిగణనలోకి తీసుకోలేదని సీబీఐ ప్రతినిధి వ్యాఖ్యానించారు. ట్రయల్ కోర్టు తీర్పుపై దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన నేతృత్వంలోని ఆప్ వర్గాలు హర్షం వ్యక్తంచేశాయి. కేజ్రీవాల్ నివాసం, ఆప్ కార్యాలయాల వద్ద కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు.

దిల్లీ మద్యం విధాన రూపకల్పనలో ఎలాంటి కుట్ర, నేరం లేదని ప్రత్యేక జడ్జి జితేంద్ర తన 598 పేజీల తీర్పులో పేర్కొన్నారు. అభియోగాలను నిరూపించే సాక్ష్యాలను సమర్పించడంలో సీబీఐ విఫలమైందని తెలిపారు. నిందితులపై ప్రాథమిక కేసులు నమోదు చేయలేదని, సీబీఐ అభియోగపత్రంలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. సాక్షుల వాంగ్మూలాలతో అభియోగాలు సరిపోవడం లేదన్నారు. సాక్షిగా ఉన్న ఒక వ్యక్తి మాటల్లో కేజ్రీవాల్ పేరు ప్రస్తావనకు రావడంతో దాని ఆధారంగానే అప్పటి దిల్లీ ముఖ్యమంత్రిపై కేసు పెట్టారని ఆక్షేపించారు.

**ఈ కేసులో 'సౌత్ గ్రూప్' అనే పదాన్ని ఉపయోగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.**

కొందరికి ప్రయోజనం చేకూర్చేలా మద్యం విధానాన్ని మార్చారనేది ప్రధాన ఆరోపణ. అయితే, ఈ పాలసీ.. చట్టబద్ధమైన చర్చలు, సంప్రదింపులతో పాటు సంబంధిత సంస్థల ఆమోదంతోనే రూపొందిందని న్యాయస్థానం పేర్కొంది. లెఫ్టినెంట్ గవర్నర్ సలహాలను తీసుకోవాల్సిన చట్టపరమైన అవసరం లేకున్నా దానిని కూడా పాటించారని తెలిపింది.

....(మిగతా2లో)

## మహిళా పోలీసుల నియామకాలపై అధ్యయనం చేయండి



**ఈ కబురు ;, హైదరాబాద్:** రాష్ట్రంలో మహిళా పోలీసుల నియామకాలు, శిక్షణ, కెరీర్‌లో పురోగతి తదితర అంశాలపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఇందుకోసం తమిళనాడు లాంటి ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పరిశీలించి నివేదిక తయారు చేయాలని సూచించారు.

....(మిగతా2లో)

### మావోయిస్టు నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో

## ప్రకటన చేస్తా

.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చన్న ముఖ్యమంత్రి
- చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేస్తుందని వ్యాఖ్య
- ప్రస్తుత పరిస్థితుల్లో తుపాకీ పట్టుకుంటే నడవదని మాజీ మావోయిస్టు కీలక వ్యాఖ్య
- కేంద్రం సహకరిస్తే రాజకీయ పార్టీగా మారుస్తాం
- సాయుధ పోరాటాన్ని విరమిస్తాం.. పీఎల్‌జీఏనూ రద్దు చేస్తాం
- లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతల వెల్లడి
- సచివాలయంలో సీఎంతో భేటీ
- అమిత్‌షా దృష్టికి తీసుకెళ్తానన్న రేవంత్‌రెడ్డి



**ఈ కబురు ;** మావోయిస్టు కీలక నేతల లొంగుబాటుపై అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మావోయిస్టు మాజీ అగ్ర నాయకులు దేవ్‌జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నరసింహా రెడ్డి, సుజాతక్క, దామోదర్, చంద్రన్నలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సచివాలయంలో సమావేశమైన విషయం తెలిసిందే. భేటీ అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జనజీవన స్రవంతిలోకి వచ్చిన తర్వాత చట్టపరిధిలో వారు ఏమైనా చేసుకోవచ్చని తెలిపారు. చట్టాలను ఉల్లంఘిస్తే మాత్రం ప్రభుత్వం తన పని తాను చేసుకుపోతుందని స్పష్టం చేశారు.

**——తుపాకీ పట్టుకుంటే నడవదు: దేవ్‌జీ**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో భేటీ అనంతరం మాజీ మావోయిస్టు దేవ్‌జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రివార్డు పాలసీని కోటి రూపాయలకు పెంచాలని ఆయన కోరారు. తమకు ఐదెకరాల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేసినట్లు వెల్లడించారు. భూమి సాధ్యం కాదని ముఖ్యమంత్రి చెప్పారని, కానీ ఇల్లు, ఉద్యోగం, జీవనభృతిపై హామీ ఇచ్చారని తెలిపారు.

....(మిగతా2లో)

## ప్రచండ్‌లో రాష్ట్రపతి గగన విహారం

- కోపైలట్‌గా ద్రౌపదీముర్ము..
- ప్రచండ్'లో పర్యటించిన రాష్ట్రపతి



**ఈ కబురు ;జైపూర్:** స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి పోరాట హెలికాప్టర్ 'ప్రచండ్'లో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శుక్రవారం గగనవిహారం చేశారు. ఫ్లయింగ్ సూట్ ధరించిన ఆమె.. 25 నిమిషాలపాటు కోపైలట్‌గా వ్యవహరించారు.తద్వారా పోరాట హెలికాప్టర్‌లో ఆకాశయానం చేసిన తొలి రాష్ట్రపతిగా ఆమె చరిత్ర సృష్టించారు.

భారత్‌పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని జైసల్మేర్ వైమానిక స్థావరం నుంచి రాష్ట్రపతి హెలికాప్టర్ టేకాఫ్ అయింది. అనంతరం కాక్‌పిట్ నుంచి ముర్ము దేశ ప్రజలకు సందేశం ఇచ్చారు. "దేశ స్వావలంబనకు ప్రచండ్ ఒక శక్తిమంతమైన నిదర్శనం. మన వీర సైనికులకు వందనం. జైహింద్! జై భారత్!!" అని ముర్ము పేర్కొన్నారు. ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి పోరాట హెలికాప్టర్. అధునాతన ఏవియానిక్స్, శత్రువులను ఏమార్చే స్టెల్త్ సామర్థ్యం, రాత్రి వేళల్లోనూ దాడులు చేయగల సత్తా దీని సొంతం. క్షిపణులు, రాకెట్లు, 20 ఎంఎం గన్‌ల వంటి ఆయుధాలను ఇది ప్రయోగించగలదు.

....(మిగతా2లో)

## కవితకు న్యాయం జరిగింది : కెటిఆర్



- లిక్కర్ స్కాం కేసులో కవితకు క్లీన్ చిట్... కేటీఆర్ స్పందన
- లిక్కర్ స్కాం పేరుతో బీఆర్ఎస్‌ను రాజకీయంగా దెబ్బతీశారంటూ ట్వీట్
- ఈరోజు కోర్టులో కవితకు న్యాయం జరిగిందన్న కేటీఆర్
- తమ నేతలపై పెట్టిన కేసులన్నీ అబద్ధమని తేలుతుందని ధీమా
- కాంగ్రెస్, బీజేపీలు మీడియా ట్రయల్స్‌తో దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శలు

**ఈ కబురు: హైదరాబాద్:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కవితకు కోర్టులో న్యాయం జరిగిందని, ఇదే విధంగా తమ పార్టీ నేతలపై పెట్టిన ప్రతి ఒక్క అక్రమ కేసు వీగిపోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కల్పిత ఆరోపణలతో సృష్టించిన ఈ కేసు ద్వారా బీఆర్ఎస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీశారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. కేటీఆర్ తన ప్రకటనలో, "లిక్కర్ స్కాం అనే కట్టుకథతో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని కూల్చేశారు. అదే కథనాన్ని అడ్డం పెట్టుకుని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను రాజకీయంగా నష్టపరిచారు. ఈరోజు కోర్టులో కవిత గారికి న్యాయం జరిగింది. ఇదే స్ఫూర్తితో మా నేతలపై బనాయించిన ప్రతి కేసు అబద్ధమని, రాజకీయ ప్రేరేపితమని, కల్పితమని త్వరలోనే రుజువవుతుంది" అని పేర్కొన్నారు

....(మిగతా2లో)



### ఏ ప్రాతిపదికన నన్ను బాధ్యుణ్ని చేశారో చెప్పాలి

**..జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్టుకు నివేదించిన కేసీఆర్**

ఈ కబురు, హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో ప్రణాళిక, డిజైనింగ్‌తో సహా అన్నింటికీ ముఖ్యమంత్రిగా తానే బాధ్యుడినని ఏ ప్రాతిపదికన జస్టిస్ ఘోష్ కమిషన్ నిర్ధారించిందో చెప్పాలని మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. తాను బాధ్యుడినని ప్రభుత్వం అందించిన రికార్డుల ప్రకారం నిర్ణయించడం సరికాదని, దానికి సంబంధించిన ఆధారాలు అందజేసి వివరణ తీసుకున్నాకే నిర్ధారణకు రావాల్సి ఉండగా...

....(మిగతా2లో)

## తెలంగాణ చైతన్యం ఏమైంది ?

- చట్టం కూడా ఉన్నవాడి చుట్టంలా మారింది..ఇది సమాజానికి మంచిది కాదు
- –పేదవాడికి న్యాయం మీద నమ్మకం పోయింది
- –రాబోయేకాలంలో.. బీసీలలో ఐక్యత పెరగాలి... జాతిని కదిలించాలి
- –అదరినీ కలుపుకొని పోయి సమాజాన్ని నడిపించాలి
- –మాది మాకు కావాలని అడుగుతున్నాం తప్ప.. మీది మాకు కావాలని అడగడం లేదు ?
- – మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్



.బరిగేసి కొట్లాడే సమాజం ఎందుకు నిర్వీర్యం అవుతుంది

**ఈ కబురు, హైదరాబాద్ ;**

తెలంగాణ చైతన్యం ఏమైంది ? ..బరిగేసి కొట్లాడే సమాజం ఎందుకు నిర్వీర్యం అవుతుంది. చట్టం కూడా ఉన్నవాడి చుట్టంలా మారింది.. ఇది సమాజానికి మంచిది కాదు. పేదవాడికి న్యాయం మీద నమ్మకం పోయింది. రాబోయే కాలంలో.. బీసీలలో ఐక్యత పెరగాలి_ _ _ జాతిని కదిలించాలి. అదరినీ కలుపుకొని పోయి సమాజాన్ని నడిపించాలి. మాది మాకు కావాలని అడుగుతున్నాం తప్ప.. మీది మాకు కావాలని అడగడం లేదు ? మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్ ప్రశ్నించారు.ఇందిరా పార్క్ వద్ద బిసి ల ధర్నాలో పాల్గొని ప్రసంగించారు.బీసీ ఉద్యమాలు, చేస్తున్న సామాజిక చైతన్యం ఒకణ్ణి గద్దె దింపి ఇంకొకణ్ణి ఎక్కించడానికి పనికి వస్తున్నాయి తప్ప మన ఆశయం నెరవేరడం లేదు. ఇంత జనాభా ఉన్న బీసీలు ఒకనికి దరఖాస్తు ఇచ్చుడు ఎందుకు ? బుచ్చగాళ్ల లెక్క అడుక్కోవడం ఎందుకు ? నీ రాజ్యం నువ్వు ఏలుకో అనే నినాదం వచ్చింది. ఎక్కడ ఉన్నా నా తపన ఈ వర్గాలకు మేలు జరగాలనే. కేంద్రంలో కూడా ఒక బీసీ మంత్రిత్వ శాఖ రావాలన్నారు.. చట్టసభల్లో రిజర్వేషన్లు రావాలి. బీసీల ఉద్యమానికి నా పూర్తి సంఘీభావం.

....(మిగతా2లో)

## జూన్ 2న భారీ బహిరంగ సభ



**ఈ కబురు, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా వచ్చే జూన్ 2న భారీ బహిరంగసభ నిర్వహించాలని ప్రభుత్వం యోచిస్తోంది.

....(మిగతా3లో)

కేజ్రీవాల్‌కు ఇదే నా సలహా..!
**అన్నాహజారే**



02

## చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు కన్నుమూత



**ఈ కబురు, హైదరాబాద్** శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ ఎంవీ సౌందరరాజన్(90) శుక్రవారం తుదిశ్వాస విడిచారు. రెండేళ్లుగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన...

....(మిగతా3లో)

## యువతిగా నకిలీ ప్రొఫైల్

**. విశాఖకు చెందిన సైబర్ క్రైమ్ నిందితుడి అరెస్టు**



**ఈ కబురు, హైదరాబాద్:** అంతర్జాతీయ సైబర్ క్రైమ్ నిందితుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. కంబోడియా నుంచి వస్తుండగా చెన్నై విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని విశాఖకు చెందిన పెదపూడి ప్రసన్నకుమార్‌గా గుర్తించారు

....(మిగతా3లో)

....(మిగతా3లో)

మావోయిస్టు నేతల లొంగుబాటుపై
# అసెంబ్లీలో ప్రకటన చేస్తా

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రి ఒకవైపు...ఈ ప్రజాస్వామ్యం అంతా బూటకం, సాయుధ తిరుగుబాటు ద్వారానే రాజ్యాధికారం దక్కించుకోవాలని ఇటీవలి కాలం వరకు తుపాకులతో పోరాడిన మావోయిస్టు అగ్రనేతలు మరోవైపు... వీరిరువురి చరిత్రాత్మక కలయికకు సచివాలయం వేదికైంది. డీజీపీ మొదలు పోలీసు ఉన్నతాధికారుల సమక్షంలో దాదాపు గంటపాటు వీరి మధ్య అనేక ఆసక్తికరమైన అంశాలపై శుక్రవారం చర్చ జరిగింది. లొంగిపోయిన మావోయిస్టు అగ్రనేతలు తమ అంతరంగాన్ని ఆవిష్కరించగా..తన పరిధిలోని అంశాలను తప్పకుండా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర దశాబ్దాలుగా అజ్ఞాతంలో ఉండి పోరాటం చేసిన మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు, సెంట్రల్ మిలటరీ కమిషన్ ఇన్‌ఛార్జి తిప్పిరి తిరుపతి ఎలియాస్ దేవ్‌జీ, కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి ఎలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు ఎలియాస్ దామోదర్ ఎలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహారెడ్డి ఎలియాస్ గంగన్నలు ఇటీవల డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన సంగతి తెలిసిందే. వీరితో పాటు గతంలో లొంగిపోయిన కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాద్ ఎలియాస్ చంద్రన్న, కేంద్ర కమిటీ సభ్యురాలు పోతుల పద్మావతి ఎలియాస్ సుజాతక్క శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. దేవ్‌జీ, రాజిరెడ్డిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే సాయుధ పోరాటాన్ని విరమిస్తామన్నారు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)ని కూడా రద్దు చేస్తామన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రజా జీవితంలోనే ఉండి, చట్టపరంగా ఉద్యమ పంథా కొనసాగిస్తామని స్పష్టం చేసిన దేవ్‌జీ తాము రాజకీయంగా పురోగమించేందుకు ప్రభుత్వాలు ముఖ్యంగా కేంద్రం సహకరించాలన్నారు. ఇలా చేస్తే మావోయిస్టు పార్టీని రాజకీయ పార్టీగా మారుస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను కలిసినప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్తానని, ఆయన ఒప్పుకొంటే ఇక్కడికే పిలిపించి, సభ ఏర్పాటు చేసి ప్రకటిస్తామన్నారు. తమ చేతుల్లో లేనందునే హామీ ఇవ్వలేకపోతున్నానని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**తక్షణం ఆరోగ్యశ్రీ అమలు**

చంద్రన్న మాట్లాడుతూ లొంగిపోయిన మావోయిస్టులకు ఇక్కడ 30 ఏళ్ల క్రితం ప్రకటించిన రివార్డు ఇస్తున్నారని, చాలా రాష్ట్రాల్లో రివార్డు సొమ్ము ఎక్కువగా ఉందని, ఇక్కడ కూడా ఇస్తే బాగుంటుందని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. లొంగిపోయిన వారికి ఇళ్ల స్థలాలు, వ్యవసాయభూమి, ఆరోగ్యశ్రీ సదుపాయం కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ తక్షణమే అమలు చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాల్లో రివార్డు సొమ్ము గురించి అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని డీజీపీని ఆదేశించారు. వ్యవసాయ భూమి ఇవ్వడం సాధ్యంకాదన్నారు. ఈ విషయాల గురించి క్యాబినెట్‌లో చర్చించి వెల్లడిస్తామన్నారు. రాజకీయపరమైన అంశాల గురించైతే ప్రభుత్వ సలహాదారు కేశవరావును, ఆర్థికపరమైన అంశాలైతే వేంనరేందర్‌రెడ్డిని కలవవచ్చని సీఎం స్పష్టం చేశారు. జనజీవన స్రవంతిలో కలవాలని నిర్ణయం తీసుకున్న మావోయిస్టు నేతలను అభినందించిన ముఖ్యమంత్రి ఎలాంటి సమస్యకైనా హింస పరిష్కారం కాదని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. లొంగిపోయిన వారికి అవసరమైన భద్రత కల్పించే విషయంలో ఎలాంటి లోటూ రాకూడదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కేశవరావు కల్పించుకొని బాహ్య ప్రపంచంలోకి వచ్చిన తర్వాత సున్నితమైన అంశాల విషయంలో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని లొంగిపోయిన నేతలకు సూచించారు. తొలుత డీజీపీ శివధర్‌రెడ్డి లొంగిపోయిన మావోయిస్టులను ముఖ్యమంత్రికి పరిచయం చేశారు. ముఖ్యమంత్రి పిలుపునను సరించి గత రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో 591 మంది లొంగిపోయారని, వారంతా ఇప్పుడు సాధారణ జీవితం గడుపుతున్నారన్నారు. ప్రభుత్వం సహకారంతో చేపట్టిన పునరావాస కార్యక్రమాలు చూసి మావోయిస్టు నాయకులు తమ మనసు మార్చుకొని లొంగిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నిఘా విభాగాధిపతి విజయ్‌కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతి, ఓఎస్డీలు దయానంద్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మావోయిస్టు నేతలంతా ముఖ్యమంత్రి, డీజీపీకి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**సుజాతక్కతో ముఖ్యమంత్రి పిచ్చాపాటి**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గద్వాలకు చెందిన సుజాతక్కతో రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కొద్దిసేపు మాట్లాడారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్లో మరణించిన మల్లోజుల కోటేశ్వర్‌రావు భార్య అయిన సుజాతక్క యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు.

మహిళా పోలీసుల నియామకాలపై
# అధ్యయనం చేయండి

సచివాలయంలో శుక్రవారం పోలీస్ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. పోలీసుశాఖలో మహిళల భాగస్వామ్యాన్ని, నాయకత్వాన్ని మరింతగా పెంచేందుకు దోహదం చేసేలా ఈ అధ్యయనం ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజీపీఏ డైరెక్టర్ అభిలాషబిస్త్ పలు సూచనలు చేశారు. బందోబస్తు విధుల్లో ఉన్న మహిళా పోలీసులకు రెస్ట్‌రూంలు, మొబైల్ టాయ్‌లెట్లు తగినంతగా ఏర్పాటు చేయాలని, గస్తీ కోసం స్కూటర్లను సమకూర్చాలని కోరారు. మహిళా పోలీసులను శాంతిభద్రతల ఠాణాలకు ఎస్‌హెచ్‌వోలుగా నియమించాలని, అంతకు ముందు 'ఫస్ట్ తెలంగాణ కాన్ఫరెన్స్ ఫర్ ఉమెన్ ఇన్ పోలీస్', 'ఆర్‌బీవీఆర్‌ఆర్ టీజీపీఏ యాన్యువల్ మేగజైన్ 2025' పుస్తకాలను డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసి సీఎం ఆవిష్కరించారు.

సమావేశంలో విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ శిఖాగోయెల్, అదనపు డీజీపీలు స్వాతిలక్రా, చారుసిన్హా, విజయ్‌కుమార్, ఐపీఎస్‌లు శ్వేత, రక్షితమూర్తి, శిల్పవల్లి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కట్టాల్సింది పోయి..
# కూల్చడంలో పోటీ పడతారా?

**ఈ కబురు** : పేదల ఇళ్లు కూల్చితే..మీ ప్రభుత్వాన్ని ప్రజలు కూల్చుతారని కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఖమ్మంలో మంత్రుల తీరు దారుణంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా ఖమ్మంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పేదల ఇళ్లు కూలగొట్టి కబ్జా చేస్తారా? అని.. కట్టాల్సింది పోయి..కూల్చడంలో పోటీ పడతారా? అని బండి ప్రశ్నించారు. కాంగ్రెస్, ఎమ్ఐఎమ్ డ్రామాలు ఎవరూ నమ్మరని, బిఆర్ఎస్ మార్గంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. రైతు భరోసా ఇస్తామని రైతులను సిఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని మండిపడ్డారు. మాసీ సిఎం కెసిఆర్ ను అరెస్ట్ చేసే ధైర్యం రేవంత్ రెడ్డికు లేదని బండి సంజయ్ పేర్కొన్నారు.

## ఏ ప్రాతిపదికన నన్ను బాధ్యుణ్ని చేశారో చెప్పాలి

దానికి విరుద్ధంగా కమిషన్ వ్యవహరించిందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల న్యాయ విచారణ నిమిత్తం జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ స్మితా సభర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్.కె.జోషిలు దాఖలు చేసిన పిటిషన్‌లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ విచారణ ప్రక్రియ సరైన విధివిధానాల ప్రకారం జరగలేదన్నారు. కమిషన్ ఏర్పాటు జరిగినప్పుడు నోటీసులు జారీ చేయవచ్చని, అందులో ఎవరైనా వచ్చి తమ వద్ద ఉన్న సమాచారం అందించవచ్చన్నారు. అదేవిధంగా ఎవరికైనా నోటీసులు, సమన్లు జారీ చేసే అధికారం కూడా కమిషన్‌కు ఉందని, దాని ప్రకారం పిటిషనర్‌కు నోటీసును సెక్షన్ 5 కింద జారీ చేశారన్నారు. దీని ప్రకారం సాక్షిగా విచారణకు రావాలని పిలిచారని.. సాక్షిగా పిలిచిన కమిషన్ దోషిగా అభియోగాలు మోపిందన్నారు. ప్రాజెక్టు స్థలాన్ని మార్చాలన్న సలహాలను పట్టించుకోకుండా స్థల ఎంపిక నుంచి ప్రాజెక్ట్ డిజైన్, టెండర్ల ఖరారు వరకు అన్నింటికీ పిటిషనర్ బాధ్యుడని నివేదికలో నిర్ధారించిందన్నారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.7,500 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొందన్నారు. కేవలం కమిషన్ వద్ద ఉన్న ప్రభుత్వ రికార్డుల ఆధారంగా ఈ నిర్ణయానికి వచ్చిందని పేర్కొన్నారు. పిటిషనర్ వ్యక్తిత్వం, ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిర్ధారణ ఉన్నపుడు ఏ ప్రాతిపదికన నిర్ణయానికి వచ్చిందో దానికి సంబంధించి సెక్షన్ 8 బి, సి ప్రకారం నోటీసు ఇవ్వాల్సి ఉందన్నారు. అభియోగాలకు సంబంధించి వివరణలు కోరాల్సి ఉందని, పిటిషనర్‌కు వ్యతిరేకంగా ఎవరు ఫిర్యాదు..లేదా ఆరోపణ చేశారో చెప్పలేదన్నారు. అలా వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చినట్లయితే వారిని ప్రశ్నించే అవకాశం పిటిషనర్‌కు ఇవ్వాలన్నారు.

కేజ్రీవాల్, కవితకు
# క్లీన్‌చిట్



మద్యం కేసులో అవినీతికి పాల్పడడం ద్వారా సమకూరిన డబ్బును నిందితులు గోవా అసెంబ్లీ ఎన్నికలకు వినియోగించారన్న ఆరోపణ సీబీఐ తన వాదనలను సమర్థించుకోవడానికి చేసిన యత్నంగా కోర్టు అభిప్రాయపడింది. లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని సీబీఐపై మండిపడింది. నిందితులను దీర్ఘకాలం జైలులో ఉంచడం వారి స్వేచ్ఛను హరించిందని అభిప్రాయపడింది.

**మనీలాండరింగ్ కేసు ఏమవుతుంది?**

కేజ్రీవాల్ తదితరులపై సీబీఐ నమోదు చేసిన అవినీతి కేసును కోర్టు కొట్టివేసినందున దానికి అనుబంధంగా ఉన్న ఈడీ (మనీలాండరింగ్) కేసు కూడా రద్దవుతుందని ఆప్ నేత తరపు న్యాయవాది ఒకరు తెలిపారు. అయితే, ఈడీ అధికారులు భిన్నమైన వాదన వినిపిస్తున్నారు. తమ దర్యాప్తు సీబీఐ కేసుపై ఆధారపడి లేదని, నగదు అక్రమ చలామణి (మనీలాండరింగ్) నిరోధక చట్టం కింద నేరంగా పరిగణించదగిన గట్టి ఆధారాలను సేకరించామని పేర్కొన్నారు. ఈడీ అభియోగాల యోగ్యతను ట్రయల్ కోర్టు ఇంకా తేల్చలేదని, అవసరమైనప్పుడు తమ వాదనలను వినిపిస్తామని ఆ సంస్థ అధికారి తెలిపారు. 'నిందితుడు నిర్దోషిగా తేలిన తర్వాత ఆ కేసుతో ముడిపడిన మనీలాండరింగ్ అభియోగాలు కూడా రద్దవుతాయ'ని విజయ్ మదన్‌లాల్ కేసు(2022)లో సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చింది. ఈడీ మాత్రం ప్రధాన కేసు ఫలితంతో సంబంధం లేకుండా మనీ లాండరింగ్‌ను ప్రత్యేక కేసుగానే పరిగణించాలని కోరుతోంది.

**మద్యం కేసు పూర్వాపరాలివీ..**

దిల్లీ ప్రభుత్వం 2021 నవంబరు 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని ఉపసంహరించుకుంది. ఈ మధ్యలో కొత్త విధానం అమలులో పలు అవకతవకలు జరిగాయని, ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. కొత్త విధానం రూపకల్పనలో వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కేసులు నమోదు చేశాయి. లైసెన్స్‌దారులకు సాయం చేసి, ప్రతిగా కొంత మొత్తం డబ్బు పొందినట్లు దర్యాప్తు సంస్థలు అభియోగాలు మోపాయి. దీనిలో భాగంగానే దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, తెలంగాణ మాజీ ఎంపీ కవితను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు.

**సీబీఐ అధికారిపై దర్యాప్తునకు ఆదేశం**

సరైన ఆధారాలు లేకుండా ప్రభుత్వ ఉద్యోగిని మద్యం కేసులో ఇరికించిన సీబీఐ అధికారిపై సంస్థాగతమైన చర్యలు తీసుకోవాలని జడ్జి జితేందర్ సింగ్ ఆదేశించారు. ఎక్సైజ్ శాఖ మాజీ డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ సింగ్‌ను ప్రథమ నిందితుడి (ఎ1)గా చేర్చడాన్ని ఆక్షేపిస్తూ ఈ వ్యాఖ్య చేశారు. అందుకు బాధ్యుడైన సీబీఐ అధికారిపై దర్యాప్తు జరపాలన్నారు. దర్యాప్తు సంస్థ విశ్వసనీయతను పరిరక్షించడానికి ఈ చర్య అవసరమని అభిప్రాయపడ్డారు.

**కన్నీరుపెట్టిన కేజ్రీవాల్**

తీర్పు అనంతరం కోర్టు ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ భావోద్వేగంతో కన్నీటిపర్యంతమయ్యారు. రాజకీయ కుట్రతోనే ఐదుగురు ఆప్ నేతలను జైలులో పెట్టారని ఆరోపించారు. 'కేజ్రీవాల్, మనీశ్ సిసోదియా నిజాయతీపరులని కోర్టు చెప్పింది. సత్యం గెలుస్తుందని మేం ఎప్పుడూ చెబుతుంటాం. న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉంది. అమిత్ షా, మోదీ కలిసి ఆప్‌ను అంతం చేయడానికి అతిపెద్ద రాజకీయ కుట్రపన్నారు' అని విమర్శించారు. దేశ ప్రజలకు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వీరి కుట్రల వల్ల దిల్లీ ప్రజలకు నష్టం జరిగిందని ఆరోపించారు. ఈ కేసులో కేజ్రీవాల్ ఆరు నెలలపాటు, మనీశ్ సిసోదియా రెండేళ్ల పాటు జైలులో ఉన్నారు.

**అభియోగాలు.. కోర్టు స్పందించిన తీరు..**

మద్యం కేసులో కవిత (17వ నిందితురాలు)ను కీలక కుట్రదారుగా ప్రాసిక్యూషన్ పేర్కొంది. మద్యం విధానాన్ని సౌత్ గ్రూపునకు అనుకూలంగా మార్చేందుకు రూ.100 కోట్లు వసూలు చేసి ఆమ్ ఆద్మీ పార్టీకి అప్పగించడంలో ఆమె కీలకంగా వ్యవహరించారని ఆరోపించింది. తన అనుచరులు అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై, బుచ్చిబాబు గోరంట్ల ద్వారా దిల్లీకి చెందిన విజయ్‌నాయర్‌తో కలిసి కవిత ఈ కుట్రకు పాల్పడ్డారని వాదించింది. మద్యం హోల్‌సేల్ వ్యాపార సంస్థ ఇండోస్పిరిట్‌కు ప్రయోజనం చేకూర్చేలా పథకం రూపొందించడం ద్వారా కవిత లబ్ధి పొందారని పేర్కొంది. భూలావాదేవీల ద్వారా శరత్‌చంద్రారెడ్డి (23వ నిందితుడు) నుంచి రూ.14 కోట్ల లబ్ధితోపాటు.. తెలంగాణ జాగృతి సంస్థకు సీఎస్ఆర్ విరాళం పొందినట్లు ఆరోపించింది. అయితే ప్రాసిక్యూషన్ కథనం అసంబద్ధంగా ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. హోల్‌సేల్ వ్యాపార సంస్థ ద్వారా ఇంకా ఎలాంటి లాభాలు పొందని శరత్‌చంద్రారెడ్డి.. రూ.14 కోట్లు ఎలా చెల్లించారనే విషయాన్ని నిరూపించలేకపోయిందని స్పష్టం చేసింది. భూలావాదేవీలకు ఎక్సైజ్ విధానంతో ఎలాంటి సంబంధం లేదని.. అది స్వతంత్ర ఒప్పందంగానే కనిపిస్తోందని పేర్కొంది. అరబిందో ఫార్మా 2021 జూన్‌లో సీఎస్ఆర్ కింద తెలంగాణ జాగృతికి రూ.80 లక్షలు చెల్లించడం కుట్రలో భాగమేనని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. అయితే మద్యం తయారీదారు లేదా హోల్‌సేల్ వ్యాపారితో శరత్‌చంద్రారెడ్డికి ఎలాంటి సంబంధముందో ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందని న్యాయస్థానం పేర్కొంది. అలాంటప్పుడు సీఎస్ఆర్ విరాళం క్విడ్‌ప్రోకోలో భాగమనేది ఊహాజనితమేనని చెప్పింది. రామచంద్ర పిళ్లై ద్వారా కవిత ఇండోస్పిరిట్‌లో 32.5 శాతం వాటా కలిగి ఉన్నారని ప్రాసిక్యూషన్ ఆరోపించింది. ఇండోస్పిరిట్‌లో పెట్టుబడిగా పెట్టిన రూ.3.4 కోట్లలో రూ.2.9 కోట్లను పలువురి నుంచి సేకరించారని ఆరోపించింది. కానీ అందుకు ఆధారాల్ని ప్రాసిక్యూషన్ సమకూర్చలేకపోయిందని న్యాయస్థానం స్పష్టం చేసింది. కవిత స్వయంగా నిధులను అందించారని నిరూపించగలిగితే పరిస్థితి వేరుగా ఉండేదని వ్యాఖ్యానించింది. మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి వాంగ్మూలాల ఆధారంగానే కవిత, కేజ్రీవాల్‌లను నిందితులుగా చేర్చారని న్యాయస్థానం పేర్కొంది. కుట్ర జరిగిందని సీబీఐ చెబుతున్న సమయంలో.. కవిత దిల్లీకి రాలేదని, కేజ్రీవాల్‌ను కలిసినట్లు ఆధారాల్లేనప్పటికీ కుట్రదారులుగా పేర్కొనడాన్ని న్యాయస్థానం తప్పుపట్టింది.

**కేసు నుంచి వీరందరికీ విముక్తి..**

**ట్రయల్ కోర్టు తీర్పుతో దిల్లీ మద్యం కేసు నుంచి విముక్తి లభించిన నిందితులు(ఎ1-ఎ23)... కుల్దీప్ సింగ్, నరేందర్ సింగ్, విజయ్ నాయర్, అభిషేక్ బోయినపల్లి, అరుణ్ రామచంద్ర పిళ్లై, ముత్తా గౌతమ్, సమీర్ మహేంద్రు, మనీశ్ సిసోదియా, అమన్‌దీప్ సింగ్ ధాల్, అర్జున్ పాండే, బుచ్చిబాబు గోరంట్ల, రాజేశ్ జోషి, దామోదర్ ప్రసాద్ శర్మ, ప్రిన్స్ కుమార్, అరవింద్ కుమార్ సింగ్, చంప్రీత్ సింగ్ రాయత్, కవిత కల్వకుంట్ల, అరవింద్ కేజ్రీవాల్, దుర్గేశ్ పాఠక్, అమిత్ అరోరా, వినోద్ చౌహాన్, ఆశీష్ చంద్ మాథుర్, శరత్ చంద్రారెడ్డి.**

కేజ్రీవాల్‌కు ఇదే నా సలహా..!
## అన్నాహజారే

**ఈ కబురు : దిల్లీ మద్యం విధానం కేసులో మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కు న్యాయస్థానం క్లీన్ చిట్ ఇవ్వడాన్ని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే స్వాగతించారు. న్యాయవ్యవస్థే అత్యున్నతమైందని, కోర్టు తీర్పును అంగీకరించాలన్నారు. సొంతగా లేదా పార్టీ గురించి ఆలోచించకుండా.. సమాజం, దేశం కోసం పనిచేయాలని ఈ సందర్భంగా కేజ్రీవాల్‌కు సలహా ఇచ్చారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామం రాలేగావ్ సిద్ధిలో మాట్లాడిన ఆయన.. బలమైన న్యాయవ్యవస్థ లేకుంటే నేరస్థులదే పైచేయి అయ్యేదని వ్యాఖ్యానించారు. కేజ్రీవాల్ ఎటువంటి తప్పు చేయలేదని న్యాయస్థానం పేర్కొందని, ఆ తీర్పును మనం గౌరవించాల్సిందేనని అన్నా హజారే అన్నారు. కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా తన కార్యకర్తలేనని చెప్పారు.**

# తెలంగాణ చైతన్యం ఏమైంది ?



బడ్జెట్ కేటాయించగానే హారతులు పట్టాము.. కానీ కార్పొరేషన్లకు ఐదు పైసలు కూడా ఖర్చు చేయలేదు. నోరులేని కులాలకు ఖర్చు చేయకుండా మోసం చేస్తున్నారని విమర్శించారు.. సంక్షేమం చేయకుండా మొండి చెయ్యి చూపించారు. మన ఉద్యమాలు, మనం చేస్తున్న సామాజిక చైతన్యం ఒకణ్ణి గద్దె దింపి ఇంకొకణ్ణి ఎక్కించడానికి పనికి వస్తున్నాయి తప్ప మన ఆశయం నెరవేరడం లేదు. అంతిమ లక్ష్యం చేరుకోవడం లేదు. ఇంత జనాభా ఉన్న బీసీలు ఒకనికి దరఖాస్తు ఇచ్చుడు ఎందుకు ? బుచ్చగాళ్ల లెక్క అడుక్కోవడం ఎందుకు ? నీ రాజ్యం నువ్వు ఏలుకో అనే నినాదం వచ్చింది. అందుకోసం ప్రయత్నం మొదలైంది. మనకు మద్దతుగా ఆయన రాకపాయే.. ఈయన రాకపాయే అని అనుకుంటున్నారు.. కింద పొగపెడితే అందరూ వస్తారన్నారు.. శశభిషలు లేవు. లెఫ్ట్ ఉన్నా, రైట్ ఉన్నా కొట్లాట మాత్రం ఆగదు. న్యాయం ధర్మం ప్రజాస్వామ్యం మన వాటా కోసం బరిగీసి కొట్లాడే బిడ్డలకు నా సంపూర్ణ మద్దతు ఎప్పుడు ఉంటుందన్నారు.. రాజ్యం ఎవరి చేతిలో ఉంటే వాడికే ఊడిగం చేస్తుందని అంబేద్కర్ గారు చెప్పారు. వడ్డించేవాడు మనవాడు కాకపోతే ఎక్కడ కూర్చున్నా ఏమీ రాదు. ప్రభుత్వం ఉన్నది పేదలకోసం. సమస్త సంపద సమస్త ప్రజల అవసరాలు తీర్చాలనేది రాజ్యాంగ స్ఫూర్తి. కానీ అది అమలుకావడం లేదు. అంబేద్కర్ గారి కలలు నిజం కాలేదు. మనం ఎవరికీ వ్యతిరేకం కాదు.రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన చేస్తున్న వారి మీదనే మన వ్యతిరేకత అన్నారు.. మన ఉద్యమంలో మాట్లాడే భాష, వ్యవహరిస్తున్న తీరు వల్ల మనకు జరిగే ప్రయోజనం ఎంతో తెలియదు కానీ.. మనవల్ల వాళ్లు ఐక్యం అవుతున్నారు. సమాజాన్ని మెప్పించే పని జరగాలి తప్ప సమాజం నుండి వేరుపడేలా మన భాష ఉండకూడదు.ఈకాలంలో కూడా కుమ్మెరలో జరిగిన సంఘటన సభ్యసమాజాన్ని తలదించుకొనేలా చేస్తున్నాయి. ఇలాంటివి ప్రజాస్వామ్యానికే దురదృష్టకర మన్నారు.

# పవన్ కల్యాణ్ నాకు జీవితాంతం పెద్దన్నే

**ఈ కబురు** ; అభివృద్ధి చెందిన రాష్ట్రాలే దేశాన్ని బలోపేతం చేస్తాయని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ముంబైలో ఏబీపీ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో జరిగిన 'ఐడియాస్ ఆఫ్ ఇండియా 2026' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏబీపీ జర్నలిస్ట్ మేఘా ప్రసాద్‌తో జరిగిన ఫైర్ సైడ్ చాట్‌లో ఆయన ఏపీ అభివృద్ధి ప్రణాళికలు, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక మాట ఇస్తే అది జరిగి తీరుతుందని, ఆయన నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించడమే తన ముందున్న కర్తవ్యమని లోకేశ్ అన్నారు. తమపై ఎలాంటి ఒత్తిడి లేదని, సవాళ్లను ఇష్టంగా స్వీకరిస్తామని తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన పవన్ కళ్యాణ్ తనకు బిగ్ బ్రదర్ అని, జీవితాంతం తనకు పెద్దన్నేనని ఆయన వ్యాఖ్యానించారు.

**ఒకే రాజధాని.. క్లస్టర్లతో అభివృద్ధి వికేంద్రీకరణ**

"మేము కేవలం ఒక నగరాన్ని మాత్రమే నిర్మించడం లేదు. ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ అనే నినాదాన్ని బలంగా నమ్ముతాం. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను ఆర్థిక రీజియన్లుగా అభివృద్ధి చేస్తూ, వాటి పరిధిలో పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నాం," అని లోకేశ్ వివరించారు. క్లస్టర్ విధానాన్ని వివరిస్తూ, "ఉదాహరణకు ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఫాక్స్‌కాన్ లాంటి ఒక కంపెనీని తీసుకురావడమే కాకుండా, ఐఫోన్ అసెంబుల్‌కు అవసరమైన అన్ని విడిభాగాల తయారీదారులను ఒకేచోటకు తీసుకురావడమే మా వ్యూహం. దీని ద్వారా అభివృద్ధిని రాష్ట్రవ్యాప్తంగా వికేంద్రీకరించడం సుసాధ్యమవుతుంది" అని తెలిపారు.

**'నమో' సర్కార్‌తో పెట్టుబడుల వెల్లువ**

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు మూడు ప్రధాన కారణాలు ఉన్నాయని లోకేష్ పేర్కొన్నారు. "ఒకటి, అద్భుతమైన ట్రాక్ రికార్డు ఉన్న అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి చంద్రబాబు... రెండవది, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్. కేవలం 17 నెలల్లోనే దేశంలోనే అతిపెద్దదైన ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు అన్ని అనుమతులు ఇచ్చాం. మార్చి మూడోవారంలో దానికి శంకుస్థాపన చేయబోతున్నాం. మూడవది, డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్. ఢిల్లీలో ప్రధాని మోదీ, ఏపీలో సీఎం నాయుడు కలయికను నేను 'నమో' (నాయుడుమోదీ) అని పిలుస్తాను. ఈ నాయకత్వం వల్లే భారతదేశానికి వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 25.3 శాతం ఏపీకి వచ్చాయి" అని ఆయన గణాంకాలతో వివరించారు.

**భూమి కన్నా ఎకోసిస్టమ్ విలువైంది**

ఫార్చ్యూన్ 500 కంపెనీలను ఆకర్షించేందుకు ఎకరా భూమిని 99 పైసలకే ఇస్తున్నామని, తాము ఇచ్చే భూమి విలువ కన్నా ఆ కంపెనీల రాకతో ఏర్పడే ఆర్థిక కార్యకలాపాలు, ఉద్యోగ కల్పన ఎన్నో రెట్లు అధికమని లోకేశ్ తెలిపారు. కాగ్నిజెంట్ కంపెనీని ఉదాహరణగా చూపుతూ, "విశాఖలో ఆ కంపెనీ ఏర్పాటుతో 25,000 ఉద్యోగాలు వస్తాయి. ఏటా రూ.1500 కోట్ల ఆర్థిక కార్యకలాపాలు జరుగుతాయి. భూమి విలువ కన్నా రాష్ట్రానికి వచ్చే ఈ ప్రయోజనం ఎంతో పెద్దది" అని స్పష్టం చేశారు.



**అమరావతే భవిష్యత్తు.. దేశానికి గర్వకారణం**

అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతోందని, ఇది భవిష్యత్తుకు చిరునామా అని లోకేశ్ అన్నారు. "పారిశ్రామికవేత్తలు ఇప్పుడు ఏపీకి రాకపోతే, భవిష్యత్తులో ఎందుకు రాలేకపోయామని బాధపడతారు. ప్రతి వంద రోజులకు ఒకసారి అమరావతికి వచ్చి చూడండి. అక్కడ పనులు ఎంత వేగంగా జరుగుతున్నాయో మీకే తెలుస్తుంది. భారతదేశం గర్వించేలా రాజధానిని నిర్మిస్తున్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి కృషితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడామని, ప్రస్తుతం అది లాభాల బాటలో పయనిస్తోందని తెలిపారు. తాము సమిష్టి సమాఖ్య స్ఫూర్తిని విశ్వసిస్తామని, డేటా సెంటర్ పాలసీ రూపకల్పనలో కేంద్రంతో కలిసి పనిచేసి దేశవ్యాప్తంగా ప్రయోజనం చేకూర్చే ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించామని లోకేశ్ పేర్కొన్నారు.

ప్రచండ్‌లో రాష్ట్రపతి
## గగన విహారం



**ఆపరేషన్ సిందూర్‌ను కళ్లకు కట్టిన 'వాయుశక్తి'**

భారత్‌పాకిస్థాన్ సరిహద్దుకు చేరువలోని పోఖ్రాన్ రేంజ్‌లో శుక్రవారం భారత వైమానిక దళం 'వాయుశక్తి' విన్యాసాలను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, వాయుసేన అధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ తదితరులు హాజరయ్యారు. ఇందులో వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్‌లు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు పాలుపంచుకున్నాయి. ఈ సందర్భంగా.. గత ఏడాది 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా నిర్వహించిన దాడులను వాయుసేన అనుకరించింది. శత్రు రన్‌వేలు, పెట్రోలియం నిల్వ కేంద్రాలు, బంకర్లు, రాడార్ శిబిరాలు, యుద్ధ ట్యాంకులు, కమ్యూనికేషన్ కేంద్రాలు, ఉగ్రవాద శిబిరాలు, మందుగుండు నిల్వ కేంద్రాల నమూనాలను యుద్ధవిమానాలు ధ్వంసం చేశాయి. ఫైటర్ జెట్‌లు, పోరాట హెలికాప్టర్లు సమన్వయంతో దాడులు చేస్తూ తమ సత్తాను చాటాయి. రాత్రివేళ చిమ్మచీకట్లోనూ ఈ విన్యాసాలు కొనసాగాయి. బందీలను విడిపించే ఆపరేషన్‌ను వాయుసేన, ఆర్మీ కమాండోలు ప్రదర్శించారు. డ్రోన్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

## కవితకు న్యాయం జరిగింది ; కెటిఆర్

ఆ నిజం నిలదొక్కుకునే వరకు కాంగ్రెస్, బీజేపీల నుంచి నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. ప్రధాన పార్టీలు చేసే ఆరోపణలకు మీడియా ట్రయల్స్ తోడై తమ పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే ప్రయత్నం జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. "దురదృష్టవశాత్తు ఇదే 'న్యూ ఇండియా'లో కొత్త ధోరణిగా మారింది. ఇక్కడ ఆధారాలతో పనిలేదు, ఆరోపణలు చేస్తే చాలు. న్యాయ ప్రక్రియ స్థానంలో మీడియా కథనాలు ప్రచారం పొందుతున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏది ఏమైనప్పటికీ, ఎన్ని కుట్రలు చేసినా, ఎంత దుష్ప్రచారం చేసినా చివరికి న్యాయమే గెలుస్తుందని, తమపై మోపిన కేసులన్నీ అవాస్తవాలని తేలిపోవడం ఖాయమని కేటీఆర్ స్పష్టం చేశారు.



## ఓవైసీ కాలేజీని
# హైడ్రా ఎందుకు కూల్చదు?

**ఈ కబురు, హైదరాబాద్;** ఎంపీ అర్వింద్ ధర్మపురి ఆధ్వర్యంలో డాక్టర్ అనూప్ గారు తమ అనుచర బృందంతో కలిసి పెద్దఎత్తున బిజెపిలో చేరారు. సామాజిక స్పృహతో సేవలందిస్తున్న వారిని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు పార్టీలోకి హృదయపూర్వకంగా ఆహ్వానించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మేధావులు, విద్యావంతులు బిజెపి వైపు ఆకర్షితులవుతున్నారు. బిజెపి సిద్ధాంతం, దేశాభివృద్ధిపై మా దృష్టి పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందనడానికి ఇదే నిదర్శనం.ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలన, పారదర్శక పాలన, పనితీరుపై దేశవ్యాప్తంగా ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు.. అందుకే వరుసగా వివిధ రాష్ట్రాల్లో భారతీయ జనతా పార్టీ అద్భుత విజయాలు సాధిస్తోంది. అదే సరళి ఇప్పుడు తెలంగాణలో కూడా మొదలైంది. ముఖ్యంగా యువత ఇతర పార్టీల నుంచి బిజెపిలో చేరుతోంది.యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఇద్దరూ ముస్లింల వ్యతిరేకులు అంటూ అక్బరుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు నాటకంలో భాగంగా చేసి చిల్లర రాజకీయ వ్యాఖ్యలే తప్ప మరొకటి కాదన్నారు..గతంలో ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి స్వయంగా "కాంగ్రెస్ ఈజ్ ముస్లిం, ముస్లిం ఈజ్ కాంగ్రెస్" అని బహిరంగంగా ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింల పార్టీ అని కూడా ప్రకటించారు. ఇది వారి రాజకీయ దృక్పథాన్ని స్పష్టంగా చూపిస్తోంది.మజ్లిస్ పార్టీ కాంగ్రెస్‌తో అంటకాగుతోందన్న విషయం ప్రజలకు అర్థమవడంతో, ఆ భయంతోనే రేవంత్ రెడ్డి అక్బరుద్దీన్‌తో మాట్లాడి ఇలాంటి వ్యాఖ్యలు చేయించినట్లు స్పష్టంగా తెలుస్తోంది.అక్బరుద్దీన్, రేవంత్ రెడ్డి ఇద్దరూ దోస్తులే. ఎప్పుడూ కలిసే ఉంటారు. బయట మాత్రం నాటకాలు ఆడుతూ, అక్బరుద్దీన్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడినట్లు చూపించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఆయన కాంగ్రెస్‌కు గానీ, సీఎంకు గానీ నిజంగా వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఇద్దరి మధ్య పక్కా అండర్‌స్టాండింగ్ ఉంది. అందుకే కాంగ్రెస్ పార్టీ మజ్లిస్‌కు కొమ్ముకాస్తోందని విమర్శించారు.కాంగ్రెస్‌మజ్లిస్ పార్టీల మతపరమైన రాజకీయాలు ప్రజలకు ఇప్పుడు పూర్తిగా అర్థమయ్యాయి. ఈ కారణంగానే రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తమకు నష్టం జరుగుతుందన్న భయంతో సీఎం రేవంత్ రెడ్డి అక్బరుద్దీన్ చేత ఈ వ్యాఖ్యలు చేయించారు.ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీఆర్‌ఎస్‌కాంగ్రెస్‌ఎంఐఎం పార్టీలు కలిసి బిజెపి గెలుపును అడ్డుకునే ప్రయత్నం చేశాయి. అదే వ్యూహంతో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీని గెలవనీయొద్దన్న ఉద్దేశంతోనే ఈ డ్రామా రాజకీయాలు చేస్తున్నాయి.రేవంత్ రెడ్డి చేతిలో గడ్డపార పట్టుకుని పేద ప్రజల ఇళ్లను కూల్చుతున్నారు. హైదరాబాద్‌లో హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొట్టారు. మూసీ సుందరీకరణ పేరుతో కూడా పేద ప్రజల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం అర్బన్ వెలుగుమట్లలో పేదల ఇళ్లను కూల్చారు. కానీ పాతబస్తీలో చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఓవైసీ కాలేజీని మాత్రం హైడ్రా ఎందుకు కూల్చడం లేదు? ఇది స్పష్టమైన వివక్ష. ఎంఐఎంకాంగ్రెస్ పార్టీలు మాయమాటలు చెబుతూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాయి. రేవంతుద్దీన్, అక్బరుద్దీన్ ఇద్దరూ దోస్తులే. హైదరాబాద్ తెలంగాణ గుండెకాయ లాంటిది. ఆ నగరాన్ని కబ్జా పెట్టేందుకే ఈ రాజకీయ నాటకాలు. అందుకే హైదరాబాద్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు నిచ్చారు.

# 'యాదాద్రి' ఆలయనగరి ఇంకెప్పుడో?



**ఈ కబురు, నల్గొండ:** యాదగిరి గుట్టలో ఆలయ నగరి (టెంపుల్ సిటీ) పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. కొండ కింద ఉన్న పెద్దగుట్టపై దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులు, పుర ప్రముఖుల విడిది కోసం ఆధునాతన హంగులతో విల్లాలు, కాటేజీలతో యాదాద్రి ఆలయ అభివృద్ధి ప్రాధికార సంస్థ (వైటీడీఏ) ఆధ్వర్యంలో ఆలయనగరి నిర్మించాలనే సంకల్పం అసంపూర్తిగా మిగిలింది. యాదగిరి క్షేత్రంలో సనాతన ఆచారంగా వస్తున్న మూడు రోజుల నిద్ర చేసేందుకు భక్తులకు అనుగుణంగా బస వసతులు కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. తితిదే తరహాలో యాదగిరి గుట్టకు సైతం స్వయం ప్రతిపత్తి కలిగిన బోర్డు ఏర్పాటుకు కావాల్సిన చర్యలు ప్రారంభించాలని 2024 నవంబరులో సీఎం రేవంత్‌రెడ్డి స్వామి వారిని దర్శించుకున్న సమయంలో ప్రస్తావించారు. వరుసగా పార్లమెంట్, ఇతరత్రా ఎన్నికలు వచ్చి కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి కార్యాచరణకు సాధ్యం కాలేదు. దశాబ్దకాలం నుంచి ఆలయ పాలకవర్గ కమిటీల నియామక ఊసేలేదు. వంశపారంపర్య ధర్మకర్తలే పాలక కమిటీల్లో కొనసాగుతున్నారు. రోజూ సగటున 40వేల పైచిలుకు చొప్పున ఈ ఏడాదికాలంలోనే 1.58 కోట్ల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. రాష్ట్రంలోని టాప్‌టెన్‌లో తొలి స్థానంలో యాదగిరిగుట్ట నిలిచింది. ఇప్పటికైనా వీటన్నింటిపై ప్రభుత్వం దృష్టి సారిస్తేనే యాదిగిరి దివ్యక్షేత్రానికి మరింతగా భక్తుల తాకిడి పెరిగే అవకాశాలున్నాయి.

**ఇదీ పరిస్థితి..**

గుట్ట కింద పెద్దగుట్ట ప్రాంతం వద్ద 850 ఎకరాలను ఆలయ నగరి పేరిట వైటీడీఏ కొనుగోలు చేసింది. ఇందులో 600 ఎకరాలు వృథాగా ఉండగా 250 ఎకరాల్లో లేఅవుట్ల ఏర్పాటు చేసి రహదారులు, నర్సరీలను ఏర్పాటు చేశారు. ఇందులోనే వైద్య కళాశాలకు, వేద పాఠశాలకు స్థలాలు ఇప్పటికే కేటాయించారు. ఆలయనగరిలో రహదారులు, వాటి మధ్య పచ్చదనం, రకరకాల పూలు పెంచుతున్నారు. రోజూ కాంట్రాక్టు కార్మికులతో వైటీడీఏ పర్యవేక్షణలో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరికి వేతనాలు సైతం వైటీడీఏ చెల్లిస్తోంది.

**కమిటీ ఏర్పాటు అనంతరమే భవిష్యత్ కార్యాచరణ**

"టెంపుల్ సిటీ నిర్మాణం కోసం 2015లో 850 ఎకరాలు భూసేకరణ చేపట్టాం. మొత్తం రూ.127 కోట్లతో 250 ఎకరాల్లో లేఅవుట్ పూర్తి చేయగా ఇందులో 15 ఎకరాలు వేద పాఠశాలకు, 20 ఎకరాలు ప్రభుత్వ వైద్య కళాశాలకు సీఎం ఆదేశాలకు అనుగుణంగా కేటాయించాం. తితిదే బోర్డు తరహాలో ప్రత్యేకంగా వైటీడీ ఏర్పాటు చేసి ఆలయ కమిటీ ఏర్పాటు చేస్తే త్వరితగతిన ఈ పనులు పూర్తయ్యే అవకాశాలున్నాయి. కాటేజీలు, విల్లాల నిర్మాణం కోసం దాదాపు 20 మంది దాతల సహకారంతో రూ.14 కోట్ల వరకు విరాళాలు అందగా.. అవి బ్యాంకు ఖాతాల్లో జమచేశాం. ప్రముఖ నిర్మాణ సంస్థల ద్వారా నిర్మించేలా ఆలయ కమిటీ నిర్ణయాలకు అనుగుణంగా భవిష్యత్తు కార్యాచరణ చేపట్టాల్సి ఉంది" అని వైటీడీఏ వైస్‌ఛైర్మన్ కిషన్‌రావు తెలిపారు.

# జూన్ 2న భారీ బహిరంగ సభ



సర్కారు చేపట్టనున్న '99 రోజుల కార్యక్రమం' ఎజెండాపై మంత్రివర్గ ఉపసంఘం శుక్రవారం రాత్రి ప్రజాభవన్‌లో ఉన్నతాధికారులతో సమావేశమై చర్చించింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, పలు శాఖల ముఖ్యకార్యదర్శులు పాల్గొన్నారు. రాష్ట్ర, జిల్లా, మండలం, గ్రామం.. ఇలా వివిధ స్థాయుల్లో 99 రోజుల పాటు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలి, వివిధ శాఖలను ఏ విధంగా సమన్వయం చేసుకోవాలనే పూర్తి సమాచారంతో కూడిన నివేదికలు రూపొందించాలని మంత్రులు సూచించారు. వచ్చే నెల 4 లేదా 5 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాలని ప్రతిపాదించారు. తేదీని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించనున్నారు. ఈ కార్యక్రమం ప్రారంభమైన తొలి 10 రోజుల్లో సీఎం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జరిగే సమావేశాల్లో పాల్గొంటారని తెలుస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు వారి జిల్లాలు, నియోజకవర్గాల్లో పాల్గొంటారు. మార్చి 16 నుంచి 30 వరకు అసెంబ్లీ సమావేశాలు జరిగే సమయంలో సైతం.. ఈ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల పాటు ఏయే కార్యక్రమాలు చేపట్టాలనే ప్రతిపాదనలను అన్ని శాఖల కార్యదర్శులు ఉపసంఘానికి వివరించారు. వాటిపై శనివారం సచివాలయంలో అన్నిశాఖల కార్యదర్శులతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చించనున్నారు. ఈ ఎజెండా అమలుకు తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళికపై చర్చించేందుకు ఆదివారం కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. సీఎం, మంత్రులు ఇందులో పాల్గొని సూచనలు ఇస్తారు.

## ఆతృతగా తవ్వేశారు...
# పట్టించుకోకుండా వదిలేశారు

- అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట రామకృష్ణ నగర్ రహదారి
- మధీనగూడలో పక్షం రోజులైనా మోక్షం లేని రోడ్డు
- ప్రజాప్రతినిధులకు పట్టింపు లేకపోవడం విడ్డూరం...

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**

"" నిర్లక్ష్యానికి పరాకాష్ట అంటే ఇదేనేమో... లక్షణంగా ఉన్న రోడ్డును ఎడాపెడా తవ్వి, పక్షం రోజులైనా పత్తా లేకుండా పోవడం నిబద్ధతకు నిదర్శనమెమో... సీసీ రోడ్డు శిథిలాల బండలతో రాకపోకలు సాగక ఇబ్బందులు పడడం ప్రజల దౌర్భాగ్యమెమో... హైటెక్ నియోజకవర్గం శేరిలింగంపల్లిలో నిర్లక్ష్యపు అధికారుల లీలలు మరెక్కడా కనిపించవేమో... సైబరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మియాపూర్ సర్కిల్ మధీనగూడ రామకృష్ణ నగర్ కాలనీలో బాగున్న రోడ్డును తవ్వేసి, నిర్లక్ష్యంగా వదిలేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ""



పదిహేను రోజుల క్రితం తవ్వి వదిలేసిన రామకృష్ణ నగర్ సీసీ రోడ్డు







దుకాణాల ముందు కుప్పలుగా సీసీ రోడ్డు శిథిలాలు



రోడ్డు పక్కనున్న ఇళ్లలోకి వాహనాలు వెళ్లలేని పరిస్థితి

మధీనగూడ జాతీయ రహదారి నుంచి రామకృష్ణ నగర్ కాలనీలోకి వెళ్లే ప్రధాన రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ఉన్న రోడ్డును తొలగించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అధికారులు అనుమతులు ఇవ్వడంతో కాంట్రాక్టర్ సీసీ రోడ్డును తవ్వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. రామకృష్ణ నగర్ కాలనీ రామాలయం రోడ్డును 15 రోజుల క్రితం జేసీబీలతో పెకిలించారు. దీంతో రహదారికి ఇరువైపులా సీసీ రోడ్డు శిథిలాలు బండరాళ్ల మాదిరి బయటకు వచ్చి రోడ్డు ప్రమాదకరంగా మారింది. మధ్యలో పిల్లబాటగా మారిన రోడ్డు మీద వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. కాలనీ లోపలికి వెళ్లేందుకు, కాలనీ నుంచి బయటకు వచ్చేందుకు ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు.

### అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం...

లక్షణంగా ఉన్న రోడ్లను తవ్వి స్థానికులను ఇరుకుటంలో నెట్టిన అధికారులపై కాలనీవాసులు మండిపడుతున్నారు. ఈ దారికి అనుకొని ఉన్న దుకాణాలకు వెళ్లే దారి లేకపోగా, ఇళ్లలో ఉన్న వాహనాలు సైతం బయటకు తీసే అవకాశం లేకుండా పోయింది. ఈ దారిలో పలు ఆసుపత్రులు ఉండగా.. రోగులు, అంబులెన్స్ లు సైతం రాలేకపోతున్నాయి. 15 రోజుల క్రితం తవ్విన రోడ్డును అధికారులు పట్టించుకోకుండా వదిలేయడంతో ఈ రహదారిపై వెళ్ళాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్ళాల్సి వస్తుందంటూ స్థానిక ప్రజలు అధికారులపై మండిపడుతున్నారు. రోడ్డు తవ్వి గాలికి వదిలేసిన అధికారుల తీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీ లోపలికి వచ్చే కార్లు, స్కూల్ బస్సులు చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సత్వరమే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



పదిహేను రోజుల క్రితం తవ్వి వదిలేసిన రామకృష్ణ నగర్ సీసీ రోడ్డు

## చిలుకూరు బాలాజీ ఆలయ
# ప్రధాన అర్చకుడు కన్నుమూత

ప్రస్తుతం ఆయన తెలంగాణ అర్చక సమాఖ్య అధ్యక్షుడిగా, ఏపీ అర్చక సమాఖ్య ఉపాధ్యక్షుడిగా... ఆలయ రక్షణ ఉద్యమానికి కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. తమిళనాడులోని చెన్నైకి చెందిన వెంకట రాఘవాచారి, కోమలమ్మ దంపతులకు జన్మించిన సౌందరరాజన్... పదో తరగతి వరకు అక్కడ చదివి ఆ తర్వాత హైదరాబాద్‌కు వచ్చారు. నగరంలోనే ఎంకాం, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆయన తర్వాత ఉస్మానియా వర్సిటీ ఆచార్యుడిగా పనిచేశారు. 1998లో ఉస్మానియా రిజిస్ట్రార్‌గా పదవీ విరమణ పొందారు. అప్పటికే చిలుకూరు బాలాజీ ఆలయ నిర్వహణ బాధ్యతలను చేపట్టిన ఆయన ఆ తర్వాత పూర్తి సమయాన్ని దానికే కేటాయిస్తూ ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారు. చిలుకూరు బాలాజీ ఆలయం ఎండోమెంట్ పరిధిలోకి వెళ్లకుండా తీవ్ర పోరాటం చేశారు. ఇక్కడి ఆలయంలో హుండీ లేదు. భక్తులంతా సమానమే అంటూ ఎలాంటి వీఐపీ దర్శనాలకు తావు ఇవ్వలేదు. 2008లో ఆలయానికి స్వయం ప్రతిపత్తి హోదా తెచ్చేందుకు అప్పటి ప్రభుత్వాన్ని ఒప్పించారు. ఆలయ మేనేజింగ్ కమిటీ ఏర్పాటు చేయగా.. అప్పటి నుంచి ఆయనే ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. 2018లో భార్య వసుమతి అనారోగ్యంతో మృతిచెందారు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా రెండో కుమారుడు రంగరాజన్ ప్రస్తుతం ఆలయ అర్చకునిగా వ్యవహరిస్తున్నారు. శనివారం ఆలయం వెనక భాగంలోని గోశాల వద్ద అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని మూసేశారు. ఆదివారం ఉదయం సంప్రోక్షణ తర్వాత దర్శనాలకు అనుమతించనున్నారు.

**సీఎం, గవర్నర్ సహా పలువురి సంతాపం**

ఈనాడు, హైదరాబాద్: సౌందరరాజన్ మృతిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉస్మానియా వర్సిటీ ఆచార్యుడిగా, రిజిస్ట్రార్‌గా పేరు ప్రఖ్యాతలు గడించిన ఆయన... ఆధ్యాత్మిక చైతన్యం విస్తరింపజేయడంలో కీలక పాత్ర పోషించారని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సౌందరరాజన్ సామాజిక విలువలను, దైవిక సమానత్వ సూత్రాన్ని నిలబెట్టారని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఓ ప్రకటనలో కొనియాడారు. సామాజిక విలువలకు ప్రాధాన్యమిచ్చిన సౌందరరాజన్ 'ప్రజా పూజారి'గా ప్రసిద్ధిగాంచారని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తంచేశారు.

# యువతిగా నకిలీ ప్రొఫైల్

. ఇతడిని మ్యాట్రిమోనియల్, క్రిప్టో ఇన్వెస్ట్ మోసం కేసులో ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. ఓ మ్యాట్రిమోనియల్ వెబ్‌సైట్‌లో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, బాధితులతో పరిచయం ఏర్పరచుకొని, యువతిగా నటిస్తూ పెళ్లి చేసుకుంటానన్న హామీతో మోసాలకు పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. నకిలీ క్రిప్టో ట్రేడింగ్ ద్వారా పెట్టుబడి పెట్టాలని ప్రలోభాలకు గురిచేసినట్లు గుర్తించారు. ఒకరి నుంచి రూ.11 లక్షలు కాజేసినట్లు విచారణలో తేలింది. దాదాపు 400 నుంచి 500 అక్రమ సిమ్ కార్డులు సేకరించి ఫేక్ అకౌంట్లు తెరిచినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది.

## కోల్‌కతాలో భూకంపం..
# పరుగులు తీసిన ప్రజలు

ఈ కబురు : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో భూకంపం సంభవించింది. శుక్రవారం మధ్యాహ్నం కోల్‌కతాలో ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం ఉదయం బంగ్లాదేశ్‌లో 5.4 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీని ప్రభావంతో కోల్‌కతా, పరిసర ప్రాంతాల్లో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. దీంతో కార్యాలయాలు, భవనాల నుంచి ప్రజలు బయటకు పరుగులు తీశారు. ప్రాథమిక నివేదికల ప్రకారం.. కోల్‌కతాలో కొన్ని సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5గా నమోదయ్యింది. భూకంప కేంద్రం నగరం నుంచి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# ఆర్‌బీఐ పేరిట ప్రచారంలో ఉన్న ఆ లెటర్ ఫేక్: కేంద్రం




పాత నాణేలకు బదులుగా భారీగా డబ్బులు ఇస్తున్నట్లుగా పేర్కొంటూ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా(RBI) పేరిట సర్క్యులేట్ అవుతున్న లేఖ నకిలీదని కేంద్రం స్పష్టం చేసింది. పాత నాణేలను ఎక్స్ఛేంజీ చేసుకునేందుకు రూ.700 ఫారం ఫీజు, రూ.12,150 డెలివరీ ఫీజుగా చెల్లించడం ద్వారా రూ.34 లక్షల వరకు నగదు పొందొచ్చని ఆశ చూపించే ఆ లేఖ పూర్తిగా నకిలీదని తేల్చి చెప్పింది. ఇదో కుంభకోణమని, ఆర్‌బీఐకి దీంతో ఎలాంటి సంబంధం లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ విభాగం సంబంధిత నకిలీ లేఖను 'ఎక్స్'లో పోస్టు చేసింది. (Fact Check)

ఆర్‌బీఐ ఎప్పుడూ డబ్బులు, ఫీజు లేదా వ్యక్తిగత వివరాలను అడుగుతూ ఈ-మెయిల్ పంపడమో లేదా లేఖలు పంపడం వంటివి చేయదని తెలిపింది. ఇలాంటి వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏదైనా పేమెంట్ చేసే ముందు జాగ్రత్తగా చెక్ చేసుకోవాలని పేర్కొంది.



## సిమ్ లేకపోతే వాట్సప్ బంద్..

# మార్చి 1 నుంచి కొత్త రూల్స్

వాట్సప్, టెలిగ్రామ్ వంటి కమ్యూనికేషన్ యాప్‌స్‌నకు సంబంధించిన సిమ్ బైండింగ్ నిబంధనలు మార్చి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. అంటే సిమ్ లేకుండా ఇకపై ఆయా యాప్స్ ఫోన్‌లో పనిచేయవన్నమాట. గతేడాది నవంబర్‌లో ఈ నిబంధనలు ప్రకటించగా.. అమలు కోసం ఆయా సంస్థలకు ఇచ్చిన గడువు ఫిబ్రవరి 28తో ముగియనుంది. అంటే మరి కొన్ని గంటల్లో కొత్త రూల్స్ అమల్లోకి రానున్నాయి. దీంతో ఎవరైనా సిమ్ లేకుండా వాట్సప్ వాడుతుంటే ఆ ఫోన్లలో యాప్ నిలిచిపోతుంది. వాట్సప్ వెబ్ కూడా ప్రతి ఆరు గంటలకు ఒకసారి ఆటోమేటిక్‌గా లాగౌట్ అయిపోతుంది.

ఏమిటీ నిబంధన?

వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్ దుర్వినియోగాన్ని అరికట్టడానికి కేంద్రం ఈ నిబంధన తీసుకొచ్చింది. ఈ యాప్స్‌నకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ టెలికాం విభాగం (డాట్) ఆదేశాలు జారీ చేసింది. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఆయా యాప్‌లను వెబ్‌బ్రౌజర్‌లో ఉపయోగిస్తే ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. మళ్లీ సేవలు పొందాలంటే క్యూఆర్ కోడ్ ద్వారా మొబైల్ సిమ్‌తో లాగిన్ అవ్వాలి. ప్రస్తుతం యాప్ ఇన్‌స్టలేషన్ సమయంలోనే సిమ్‌కార్డును ధ్రువీకరించుకుంటున్నారు. ఆ తర్వాత డివైజ్ నుంచి సిమ్‌కార్డును తొలగించినా, డీయాక్టివేట్ చేసినా సేవలు మాత్రం కొనసాగుతున్నాయి. దీంతో ఇతర దేశాల్లో ఉండే సైబర్ నేరగాళ్లు యాప్‌స్‌ను వినియోగించుకోవడం సాధ్యమవుతోంది. సిమ్ బైండింగ్ నిబంధన వల్ల మోసపూరిత కార్యకలాపాలు తగ్గుతాయని సైబర్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన సిమ్ బైండింగ్ రూల్స్ అమలుకు వాట్సప్ సిద్ధమవుతోంది. సిమ్ కార్డు లేని సందర్భాల్లో యాప్ పనిచేయకుండా నిరోధించేందుకు బీటా టెస్టింగ్ నిర్వహిస్తోంది. దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను వాబీటా ఇన్ఫో పంచుకుంది. మరోవైపు సిమ్ బైండింగ్ రూల్స్ అమలు సంబంధించిన గడువును పొడిగించేది లేదని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఇప్పటికే స్పష్టంచేశారు. దీంతో మార్చి 1 నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

## స్మార్ట్ ఫోన్ కాలుతోంది...

# ధరలు పెంచేస్తున్న కంపెనీలు!



స్మార్ట్‌ఫోన్ ధరల పెంపు.. గత కొన్ని నెలలుగా వినిపిస్తున్న మాటే. మెమొరీ చిప్‌ల కొరత వల్ల స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగనున్నాయన్న అంచనాలు వెలువడ్డాయి. కంపెనీలూ సంకేతాలు ఇచ్చాయి. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్ తయారీ కంపెనీలు ఒక్కొక్కటిగా ఆచరణలోకి తెస్తున్నాయి. కొత్తగా లాంచ్ చేస్తున్న స్మార్ట్‌ఫోన్లతో పాటు ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న మోడళ్ల ధరలూ పెంచేస్తున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన స్మార్ట్‌ఫోన్ దిగ్గజం శాంసంగ్.. ఇటీవల ధరల పెంపు చేపట్టగా.. చైనాకు చెందిన వివో, ఐకూ బ్రాండ్లు ధరల పెంపునకు సిద్ధమవుతున్నాయి.

చైనాకు చెందిన వివో, దాని అనుబంధ ఐకూ స్మార్ట్‌ఫోన్ ధరల పెంపును ప్రకటించాయి. వివో టీ4, ఐకూ జడ్10 సిరీస్ ఫోన్లపై గరిష్ఠంగా రూ.2,500 వరకు పెంచుతున్నాయి. మార్చి 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. వివో టీ4X, వివో టీ4R, వివో టీ4 మోడళ్లపై కనిష్ఠంగా రూ.1,500, గరిష్ఠంగా రూ.2,500 పెంచుతున్నట్లు వివో పేర్కొంది. ఇక ఐకూ జడ్10X, ఐకూ జడ్10R, ఐకూ జడ్10 మోడళ్ల ధరలూ అదే స్థాయిలో పెంచుతున్నట్లు ఐకూ పేర్కొంది.

శాంసంగ్ పెంచేసింది: శాంసంగ్ తన ఏ, ఎఫ్ సిరీస్ మోడళ్ల ధరలను తాజాగా సవరించింది. బడ్జెట్, మిడ్ రేంజ్ సెగ్మెంట్‌కు చెందిన ఎఫ్ 17, ఏ36, ఏ56 ఈ జాబితాలో ఉన్నాయి. ఈ ఫోన్ల ధరలను కనిష్ఠంగా రూ.1,000 నుంచి గరిష్ఠంగా రూ.2,000 వరకు పెంచింది. పెరిగిన ధరలు ఫిబ్రవరి 25 నుంచే అమల్లోకి వచ్చాయి. రిటైల్, ఆన్‌లైన్ స్టోర్లలో పెరిగిన ధరలే దర్శనమిస్తున్నాయి. ఎస్ 26 ధరా ఎక్కువే: శాంసంగ్ తాజాగా లాంచ్ చేసిన ఫ్లాగ్‌షిప్ స్మార్ట్‌ఫోన్ ఎస్26 సిరీస్ ధరలను కూడా భారీగా పెంచేసింది. ఎస్26 ధర రూ.87,999 నుంచి; ఎస్26+ ధర రూ.1,19,999; అల్ట్రా ధర రూ.1,39,999 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఎస్25 లైనప్‌తో పోల్చినప్పుడు ఎస్ 26 ధర ఏకంగా రూ.13 వేలు ఎక్కువ కాగా.. ఎస్26 ప్లస్ ధర ఏకంగా రూ.20 వేలు ఎక్కువ ధరకు తీసుకొచ్చింది. ఎస్26 అల్ట్రా ధర కూడా గత స్మార్ట్‌ఫోన్‌తో పోలిస్తే రూ.10వేలు అధికం.

ఎందుకీ పెరుగుదల?

స్మార్ట్‌ఫోన్ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం మెమొరీ చిప్‌ల కొరత. ఏఐ డేటా సెంటర్ల నుంచి విపరీతమైన డిమాండ్ కారణంగా అంతర్జాతీయంగా మెమొరీ చిప్‌ల కొరత ఏర్పడింది. దీంతో మొబైల్ తయారీ ఖర్చు పెరుగుతోంది. దీనికితోడు స్మార్ట్‌ఫోన్లలో ఏఐ సాంకేతికతను జోడిస్తుండడంతో ప్రీమియం స్మార్ట్‌ఫోన్ ధరలకు రెక్కలు వస్తున్నాయి. స్మార్ట్‌ఫోన్‌లలో వినియోగించే ప్రాసెసర్ల ధరలను ఆయా కంపెనీలు పెంచుతుండడం వల్ల మొబైల్ తయారీ కంపెనీలు కూడా ఆ భారాన్ని వినియోగదారుల పైకి బదలాయిస్తున్నాయి. ధరల పెంపుపై నథింగ్ సీఈఓ కార్ల్‌పై ఇదివరకే క్లారిటీ ఇచ్చారు. ఈ ఏడాది రాబోయే స్మార్ట్‌ఫోన్ల ధరలు పెరగబోతున్నాయని, అందుకు నథింగ్ కూడా మినహాయింపు కాదన్నారు.

# ట్రంపే గెలిచాడు.. వెనక్కి తగ్గిన నెట్‌ఫ్లిక్స్

**: నెట్‌ఫ్లిక్స్- వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ మధ్య కొన్ని రోజుల క్రితం డీల్ కుదిరింది. ఇప్పుడు ఆ ఒప్పందం నుంచి నెట్‌ఫ్లిక్స్ (Netflix) వెనక్కి తగ్గింది. చివరకు ట్రంప్‌తో సంబంధం ఉన్న పారామౌంట్ స్కైడ్యాన్స్‌కు లైన్ క్లియర్ అయింది. ఇంతకీ ఏం జరిగిందంటే..?**



వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ (WBD)కి చెందిన టీవీ, సినిమా స్టూడియోలు, స్ట్రీమింగ్ విభాగాన్ని కొనుగోలు చేయడానికి నెట్‌ఫ్లిక్స్, కామ్‌కాస్ట్ కార్పొరేషన్, పారామౌంట్ సంస్థలు పోటీపడ్డాయి. ఈ బిడ్డింగ్ వార్‌లో తొలుత నెట్‌ఫ్లిక్స్‌పై డిస్కవరీ మొగ్గు చూపింది. వార్నర్ సంస్థను కొనుగోలు చేసేందుకు తాత్కాలిక ఒప్పందం కూడా కుదిరింది. కానీ ఆ ఒప్పందాన్ని పరిశీలించాల్సి ఉందంటూ ట్రంప్ ప్రకటనలు చేయడం, భారీ మొత్తాన్ని కోట్ చేస్తూ పారామౌంట్ హోస్టైల్ బిడ్ వేయడంతో సీన్ మొత్తం మారిపోయింది. మేనేజ్‌మెంట్ ఈ డీల్‌కు అనుకూలంగా లేనప్పుడు నేరుగా వాటాదారులు లక్ష్యంగా ఈ 'హోస్టైల్ బిడ్'ను వేస్తుంటారు.

నెట్‌ఫ్లిక్స్ స్ట్రీమింగ్ సంస్థ చేసుకున్న తాత్కాలిక ఒప్పందం ప్రకారం.. ఒక్కో షేరుకు 28 డాలర్లు కాగా, పారామౌంట్ 30 డాలర్లు ఆఫర్ చేసినట్లు తెలిసింది. ఇదే తమకు బెటర్ ఆఫర్ అని డబ్ల్యూబీడీ గురువారం ప్రకటించింది. ఈ డీల్ చర్చల్లో భాగంగానే నెట్‌ఫ్లిక్స్ సీఈఓ టెడ్ సరండోస్ వైట్‌హౌస్‌కు వెళ్లారు. ఆయన వెళ్లిన కొద్దిసేపటికే డబ్ల్యూబీడీ నుంచి ప్రకటన రావడం గమనార్హం. ఆ తర్వాతే తాము వెనక్కి తగ్గుతున్నట్లు నెట్‌ఫ్లిక్స్ యాజమాన్యం వెల్లడించింది. ఇక కొత్త ఒప్పందం కుదిరితే సీఎన్ఎన్, కేబుల్ బిజినెస్, హెచ్‌బీఓ వంటి వ్యాపారాలన్నీ స్కైడ్యాన్స్ కిందకురానున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) సన్నిహితుడు, ఒరాకిల్ వ్యవస్థాపకుడు లారీ ఎలిసన్ కుటుంబం నియంత్రణలోకి ఇవన్నీ వెళ్లనున్నాయి. దీంతో రెండు హాలీవుడ్ స్టూడియోలు ఒకే గొడుగు కిందికి రానున్నాయి. స్ట్రీమింగ్ సంస్థలు హెచ్‌బీఓ మ్యాక్స్, పారామౌంట్, రెండు మీడియా సంస్థలు సీఎన్ఎన్, సీబీఎస్ కలిసి పనిచేయనున్నాయి. అయితే ఈ డీల్.. అమెరికాలో, విదేశాల్లో యాంటీ ట్రస్ట్ పరిశీలనను ఎదుర్కొనే అవకాశం ఉంది.

# అమెరికాను 2040లో.. చైనాను 2060లో



దిల్లీ: అంతర్జాతీయ ఇంధన వ్యవస్థలో భారత్ కీలక పాత్ర పోషించనుంది. 2040ల్లో అమెరికాను, 2060ల్లో చైనాను ఇంధన గిరాకీలో భారత్ అధిగమించగలదని, షెల్ ఇండియా విడుదల చేసిన 'ఇండియాస్ ఎనర్జీ ట్రాన్సిషన్ ఇన్ ఏ సెక్యూరిటీ ఫోకస్డ్ ఏజ్' నివేదిక అంచనా వేస్తోంది. దీని ప్రకారం..

భారత ఇంధనాల్లో సంప్రదాయ ఇంధన వాటా ఈ దశాబ్దంలో గరిష్ఠ స్థాయికి చేరుకుంటుంది. ఆ తర్వాత ఈ వాటా కాస్త తగ్గొచ్చు. వచ్చే రెండు మూడు దశాబ్దాల్లో మొత్తం మీద ఇంధన గిరాకీ రెండింతలు అయ్యే అవకాశాలున్నాయి. గత దశాబ్దంలో దూసుకెళ్లిన ఆర్థిక, జనాభా వృద్ధి కారణంగా భారత ఇంధన గిరాకీ 40% పెరిగింది. 2015లో మొత్తం విద్యుత్ వినియోగంలో సౌర, పవన విద్యుత్ వాటా 3% దరిదాపుల్లో ఉండగా.. ప్రస్తుతం అది 20% పైగా చేరింది. 2050 కల్లా అది 59 శాతానికి మించొచ్చు. వచ్చే దశాబ్దంలో సహజ వాయువు, ఎల్ఎన్‌జీ కీలక పాత్ర పోషించనున్నాయి. వీటి గిరాకీ 50% లేదా అంతకంటే ఎక్కువ పెరగొచ్చు. పారిశ్రామికాభివృద్ధి, ఏఐ ఆధారిత విద్యుత్ వినియోగం ఇందుకు దోహదం చేయవచ్చు.

# అక్టోబర్ డిసెంబర్‌లో జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతం




దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్- డిసెంబర్ (Q3) త్రైమాసికంలో దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి నమోదు చేసినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో వృద్ధి రేటు 7.4 శాతంగా ఉంది. ఈ మేరకు శుక్రవారం కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలను కేంద్రం విడుదల చేసింది. ఇప్పటి వరకు 2011-12ను ఆధార సంవత్సరంగా వ్యవహరిస్తుండగా.. దాన్ని 2022-23కు మార్చారు. కొత్త సిరీస్ ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీ 7.6 శాతం వృద్ధి నమోదు చేయొచ్చని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ అంచనా వేస్తోంది. ఈ ఏడాది జనవరిలో 7.4 శాతంగా వేసిన అంచనాలతో పోలిస్తే ఇది ఎక్కువే. అలాగే, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబర్ త్రైమాసికానికి వృద్ధి రేటును కూడా 8.2 శాతం నుంచి 8.4 శాతానికి సవరించింది. తొలి త్రైమాసికానికి మాత్రం 7.8 శాతం నుంచి 6.7 శాతానికి తగ్గించింది. తాజా గణాంకాల్లో జీఎస్‌టీ, ఇ-వాహన్ గణాంకాల వివరాలనూ చేర్చారు. వంట మనిషి, డ్రైవరు సహా ఇంట్లో పనివాళ్లు అందించే సేవలను కూడా జీడీపీ లెక్కింపునకు పరిగణనలోకి తీసుకున్నారు.

# 4000 మంది ఉద్యోగులకు లేఆఫ్.. భారీగా పెరిగిన 'బ్లాక్' షేర్లు

అమెరికాకు చెందిన ఆర్థిక సేవల సంస్థ 'బ్లాక్' (Block) 4000 మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ కంపెనీ సీఈఓ జాక్ డోర్సే (Jack Dorsey) పేర్కొన్నారు. "ఏఐ టూల్స్ కంపెనీ పనితీరును మార్చాయి. ఆ ప్రభావం ఇప్పటికే మాకు కనిపిస్తోంది. కొద్దిపాటి సిబ్బంది కూడా ఆ టూల్‌స్‌ను వాడి మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉంది. చాలా కంపెనీలు ఈ విషయాన్ని ఆలస్యంగా గుర్తించాయని అనుకుంటున్నా" అని డోర్సే అభిప్రాయం వ్యక్తంచేశారు. కంపెనీ చరిత్రలో తాము తీసుకున్న అత్యంత క్లిష్టమైన నిర్ణయాల్లో ఇదొకటని లేఆఫ్‌లను ఉద్దేశించి పోస్టు పెట్టారు. అలాగే ఆ సిబ్బందికి 20 వారాల వేతనంతో పాటు ఆరు నెలలు హెల్త్ కవర్ ఉంటుందని చెప్పారు. వారు వేరే ఉపాధి వెతుక్కొనే క్రమంలో సహకరిస్తామని చెప్పారు.

భారీగా పెరిగిన బ్లాక్ షేర్లు..

ఏఐ టూల్స్ మెరుగైన పనితీరు ప్రదర్శిస్తున్నాయని, దాంతో మిగతా సంస్థలు కూడా తమ శ్రామిక శక్తిని తగ్గించుకునే అవకాశం ఉందని డోర్సే అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ లేఆఫ్‌ల ప్రకటనతో బ్లాక్ షేర్లు అమాంతం పెరిగాయి. ఎక్స్‌టెండెడ్ ట్రేడింగ్‌లో ఒక్కో షేరు ధర 24 శాతం కంటే ఎక్కువ పెరిగింది. ట్విటర్ (ప్రస్తుతం ఇది ఎక్స్‌గా మారింది) వ్యవస్థాపకుల్లో ఒకరే జాక్ డోర్సే. ఆయన 2009లో స్క్వేర్ సంస్థను స్థాపించారు. 2021లో దానికి బ్లాక్‌గా పేరు మార్చారు. కంపెనీ వినియోగిస్తోన్న బ్లాక్ చెయిన్ సాంకేతికతను ప్రతిబింబించేలా అలా పేరు మార్చారు.



## ఆఖర్లో అమ్మకాల ఒత్తిడి..

# 961 పాయింట్లు పతనమైన సెన్సెక్స్



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, రియాలిటీ, ఫార్మా స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ ఓ దశలో వెయ్యికి పైగా పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 25,200 దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్ల మేర ఆవిరై.. రూ.463 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 82,220.48 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,248.61) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా ఓ మోస్తరు శ్రేణిలో కదలాడిన సూచీ.. ఆఖర్లో మరింత పతనమైంది. ఈ క్రమంలోనే దాదాపు వెయ్యి పాయింట్లకు పైగా కోల్పోయి 81,159.15 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 961.42 పాయింట్ల నష్టంతో 81,287.19 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 91.02కు చేరింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్ మినహా మిగిలిన స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, మారుతీ సుజుకీ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5169 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## పెళ్లి తర్వాత తొలిసారి.. ఎయిర్‌పోర్ట్ లో విజయ్‌రష్మిక సందడి



టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహం తర్వాత తొలిసారిగా కెమెరాల కంటపడ్డారు. పెళ్లయిన మరుసటి రోజు ఈ నూతన వధూవరులు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమై సందడి చేశారు. కొత్త పెళ్లికూతురుగా రష్మిక ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోగా, విజయ్ దేవరకొండ స్టైలిష్ ఇండో-వెస్ట్రన్ దుస్తుల్లో రాజసంగా కనిపించారు.

నిన్న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి వివాహం అత్యంత వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. పెళ్లి వేడుకల అనంతరం మరుసటి రోజే ఈ కొత్త జంట ఎయిర్‌పోర్ట్‌లో కనిపించడంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. తమ అభిమాన జంటను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్నారు.

ఈ సందర్భంగా విజయ్, రష్మిక ఇద్దరూ చిరునవ్వులు చిందిస్తూ అభిమానులకు అభివాదం చేశారు. అభిమానుల కేరింతల మధ్య ఫ్లయింగ్ కిస్‌లు ఇస్తూ వారిని ఉత్సాహపరిచారు. ప్రస్తుతం ఈ కొత్త జంటకు సంబంధించిన ఎయిర్‌పోర్ట్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.




## ప్రభాస్ 'స్పిరిట్'...
## వివేక్ ఒబెరాయ్ లుక్ చూశారా?

హైదరాబాద్: ప్రభాస్ (Prabhas) కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా (Sandeep Reddy Vanga) దర్శకత్వంలో రూపొందుతున్న హైఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్' (Spirit). ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీకి సంబంధించి ఆసక్తికర అప్‌డేట్‌ను సందీప్ వంగా పంచుకున్నారు. ఇందులో ప్రతినాయకుడిగా నటిస్తున్న వివేక్ ఒబెరాయ్ లుక్‌ను విడుదల చేశారు. 2027 మార్చి 5న ఈ మూవీని ప్రపంచవ్యాప్తంగా విడుదల (Spirit Movie Release Date) చేయనున్నారు. ఇప్పటివరకూ తెరపై చూడని సరికొత్త అవతారంలో ప్రభాస్ ఇందులో కనిపించనున్నారు. ఇందులో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్నారు. పోలీసు కథతో పాటు, మాఫియా నేపథ్యాన్ని కూడా 'స్పిరిట్'లో (Spirit Movie Story) సందీప్ చూపించబోతున్నారట. త్రిప్తి దిమ్రీ కథానాయిక. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్, సీనియర్ నటి కాంచన తదితరులు నటిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా తొమ్మిది భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. టి సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ప్రొడక్షన్స్ సంస్థలపై ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్‌కుమార్, క్రిషన్‌కుమార్ నిర్మిస్తున్నారు.

## తెలుగు సినిమాపై తాప్సీ ప్రశంసలు..
# ఆ విమర్శలతో యూటర్న్!



నటి తాప్సీ (Taapsee) సౌత్‌ఇండస్ట్రీపై ముఖ్యంగా టాలీవుడ్‌పై ఇటీవల చేసిన వ్యాఖ్యలు వైరలైన విషయం తెలిసిందే. ఇక్కడి నుంచి బాలీవుడ్‌కు వెళ్లిన తాప్సీ తన మొదటి సినిమా గురించి పంచుకుంటూ కొన్ని ఆరోపణలు చేశారు. గ్లామర్ సన్నివేశాలు, పాటలకు సంబంధించి.. మరింత ఆకర్షణీయంగా కనిపించాలనే ఉద్దేశంతో ప్యాడెడ్ బ్రా ధరించాలని సౌత్ ఫిల్మ్‌మేకర్స్ తనపై ఒత్తిడి తెచ్చేవారని ఆరోపించారు. వీటిపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో తాప్సీ తాజాగా టాలీవుడ్‌పై ప్రశంసలు కురిపించారు.

తెలుగు సినిమాలో నటనకు ఎక్కువ ప్రాధాన్యం ఉండే పాత్రలు ఉంటాయని అన్నారు. తెలుగుతో పోలిస్తే తమిళంలో అలాంటివి తక్కువ అని అన్నారు. టాలీవుడ్ అందించినన్ని మంచి పాత్రలు తమిళ సినిమా తనకు అందించలేదన్నారు. తెలుగు ప్రేక్షకులకు తానంటే బాగా అభిమానమన్నారు. టాలీవుడ్‌లో వచ్చిన అవకాశాలు తన విలువని పెంచాయని అన్నారు. అవి తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. ప్రస్తుతం బాలీవుడ్‌కి పరిమితమైన తాప్సీ.. సౌత్‌లో నటించడం వల్ల తనకు తగిన గుర్తింపురాలేదని పలుమార్లు కామెంట్స్ చేశారు. తెలుగు మూవీ 'ఝుమ్మంది నాదం'తో ఆమె హీరోయిన్‌గా పరిచయమయ్యారు. టాలీవుడ్‌లో ఆమె చివరి సినిమా 2022లో వచ్చిన 'మిషన్ ఇంపాజిబుల్'.

## ప్రధాని మోదీ నుంచి ఆశీస్సులు తీసుకున్న 'విరోష్'




రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో టాలీవుడ్ యాక్టర్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహం అంగరంగ వైభవంగా జరిగిన విషయం తెలిసిందే. వివాహ బంధంలోకి అడుగుపెట్టడానికి ముందే ఈ జంట ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుస్తోంది. ఇన్నాళ్లూ గోప్యంగా ఉన్న ఈ భేటీకి సంబంధించిన ఫొటోలను తాజాగా విజయ్ టీమ్ విడుదల చేయడంతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**ప్రధానికి ప్రత్యేక ఆహ్వానం**

ప్రధాని మోదీని కలిసి ఆశీస్సులు తీసుకోవడంతో పాటు మార్చి 4న హైదరాబాద్ లో జరగనున్న తమ వెడ్డింగ్ రిసెప్షన్ కు ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రధాని నూతన దంపతులకు తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు సమాచారం.

కాగా, ఉదయ్‌పూర్ లో కేవలం అత్యంత సన్నిహితుల మధ్యే 'విరోష్' పెళ్లి జరగగా, చిత్ర పరిశ్రమ, రాజకీయ మరియు క్రీడా రంగాలకు చెందిన ప్రముఖుల కోసం హైదరాబాద్‌లో భారీ రిసెప్షన్ ప్లాన్ చేశారు. మార్చి 4న జరగబోయే ఈ వేడుకకు దేశవ్యాప్తంగా ఉన్న సినీ దిగ్గజాలు హాజరుకాబోతున్నారు.

## ప్రేమలో డెకాయిట్



ఇప్పుడంటే అందరి దృష్టిలో అతనొక డెకాయిట్. కానీ అంతకుముందు అతనొక భగ్న ప్రేమికుడు. ఆ క్షణాల్లో అతని భావాలు ఎలా ఉండేవో, ఆ తర్వాత అతనికి ఏం జరిగిందో తెలియాలంటే 'రుబారూ...' పాట వినాల్సిందే అంటున్నారు అడివి శేష్ (Adivi Sesh). ఆయన కథానాయకుడిగా నటిస్తున్న ద్విభాషా చిత్రం... 'డెకాయిట్' (Dacoit). మృణాల్ ఠాకూర్ (Mrunal Thakur) కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రని పోషిస్తున్నారు. షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'రుబారూ...' అంటూ సాగే పాటని చిత్ర బృందం విడుదల చేసింది. భీమ్స్ సిసిరోలియో స్వరాలు సమకూర్చి, చిన్మయి శ్రీపాదతో కలిసి ఆలపించారు. ఏప్రిల్ 10న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.




## హైకోర్టులో 'ది కేరళ స్టోరీ 2'కు ఊరట.. విడుదలకు మార్గం సుగమం

'ది కేరళ స్టోరీ 2' (The Kerala Story 2) విడుదలకు మార్గం సుగమమైంది. సినిమా విడుదల కాకుండా కేరళ హైకోర్టు సింగిల్ బెంచ్ స్టే ఇచ్చిన సంగతి తెలిసిందే. సీబీఎఫ్‌సీ తీరును తప్పుబడుతూ సినిమాను పునఃపరిశీలించాల్సిందిగా ఆదేశించింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ చిత్ర బృందం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. ఇరు వర్గాలు వాదనలు విన్న న్యాయస్థానం సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను ఎత్తివేసింది. దీంతో 'ది కేరళ స్టోరీ 2: తదుపరి కథ' మూవీకి విడుదలకు ఉన్న అడ్డంకి తొలగినట్లైయింది.

2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: తదుపరి కథ' రూపొందింది. ఫిబ్రవరి 27న (the kerala story 2 release date) ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించగా, కేరళ హైకోర్టు ఉత్తర్వులతో వాయిదా పడింది. ఇప్పుడు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో ప్రేక్షకుల ముందుకు రానుంది.

**రివ్యూ:**

# విష్ణు విన్యాసం.. శ్రీవిష్ణు కామెడీ ఎంటర్‌టైనర్ మెప్పించిందా?

**చిత్రం: విష్ణు విన్యాసం; నటీనటులు: శ్రీవిష్ణు, నయన సారిక, సత్య, మురళీ శర్మ, బ్రహ్మాజీ, ప్రవీణ్, సత్యం రాజేశ్, శ్రీకాంత్ అయ్యంగార్, శ్రీనివాస్ వడ్లమాని, గోపరాజు రమణ తదితరులు; సంగీతం: రథన్; ఎడిటింగ్: కార్తికేయన్ రోహిణి; సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్; నిర్మాత: సుమంత్ నాయుడు; రచన, దర్శకత్వం: యదునాథ్ మారుతీరావు; విడుదల: 27-02-2026**

వినోదాత్మక చిత్రాలకు చిరునామాగా నిలుస్తూ వరుస విజయాలందుకుంటున్నారు కథానాయకుడు శ్రీవిష్ణు. 'సింగిల్' విజయం తర్వాత ఇప్పుడాయన నుంచి వచ్చిన కొత్త చిత్రం 'విష్ణు విన్యాసం'. మరి ఈ చిత్రం ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించిందా? లేదా?

కథేంటంటే..

విష్ణు (శ్రీవిష్ణు) జూనియర్ లెక్చరర్. మూఢ నమ్మకాలెక్కువ. మంచి సమయం చూసుకోనిదే ఇంటి నుంచి అడుగు కూడా బయట పెట్టడు. వాస్తు.. న్యూమరాలజీ తూ.చ. తప్పకుండా ఫాలో అయిపోతుంటాడు. ఈ కారణాల వల్లే మూడు పదుల వయసొచ్చినా ఇంకా పెళ్లి కాదు. తన కాలేజీలోనే మనీషా (నయన్ సారిక) అనే లెక్చరర్ కింద ఓ ఏడాది పని చేయాల్సి వస్తుంది. ఆమెదీ విష్ణులాగే మరో చిత్రమైన సమస్య. దాని వల్లే పదేళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని సంబంధాలు చూసినా, పెళ్లి చేసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. అలాంటి అమ్మాయి.. విష్ణుపై తొలి చూపులోనే మనసు పారేసుకుంటుంది. తొలుత ఆమె చిత్రమైన వ్యవహారశైలి చూసి విష్ణు ఓకే చెప్పడానికి ఆలోచించినా.. జాతకాలు కుదిరాయని తెలియడంతో ఆమె ప్రేమకు పచ్చజెండా ఊపేస్తాడు. అయితే సరిగ్గా ఈ ప్రేమ పెళ్లి పీటలెక్కిద్దామనుకునే సమయానికి మనీషా తన జీవితంలో ఉన్న అసలు సమస్యను బయట పెడుతుంది. దీంతో ఒక్కసారిగా శ్రీవిష్ణు లైఫ్ తలకిందులైపోతుంది. మరి ఇంతకీ మనీషా జీవితంలో ఉన్న ఆ సమస్య ఏంటి? దానికీ ఆమెకి పెళ్లి కాకపోవడానికి ఉన్న లింకేంటి? తనని చేసుకుంటే విష్ణు ప్రాణాలకు వచ్చే ముప్పేంటి? ఆఖరికి వీళ్ల ప్రేమ పెళ్లి పీటలెక్కిందా? లేదా? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.

**ఎలా సాగిందంటే...**

జాతకాలు, న్యూమరాలజీ లాంటి అంశాలతో ముడిపడిన కథ ఇది. హీరోకి జాతకాల పిచ్చి ఉండటం.. దాన్ని నమ్ముకుని అతను చేసే తింగరి పనులు.. ఈ తరహా క్యారెక్టరైజేషన్‌తో ఇప్పటికే తెలుగు తెరపై చాలా కథలొచ్చాయి. ఈ 'విష్ణు విన్యాసం' కూడా ఆ తాను ముక్కే. అయితే ఈ కథలో కథానాయిక పాత్రని తీర్చిదిద్దిన తీరు.. ఆమె జీవితంలోని సమస్య కాస్త కొత్తగా ఉంటాయి. సినిమాలో పండే వినోదమంతటికీ ఈ పాత్రే కీలకం. ప్రథమార్ధంలో కథంతా ఊహలకు తగ్గట్లే సాగుతుంది. నాయకానాయికల పరిచయ సన్నివేశాలు.. వాళ్లిద్దరూ ప్రేమలో పడే తీరు ఏమంత కొత్తగా అనిపించవు. ఎప్పుడైతే కథానాయిక పాత్రలోని మరో కోణం బయటకొస్తుందో అక్కడి నుంచే నెమ్మదిగా కథలో వినోదం మొదలవుతుంది. శ్రీవిష్ణు నుంచి కోరుకునే ట్రెండీ డైలాగ్స్, మీమ్ కంటెంట్ క్రమంగా బయటకు రావడం మొదలవుతుంది. అదంతా యువతరానికి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. కథానాయిక చేష్టలు చూసి ప్రేమ విషయంలో హీరో కన్ఫ్యూజ్ అయ్యే తీరు.. జాతకాలు సెట్టయ్యాయని తెలిశాక ఆమెతో ప్రేమలో ఉంటూ తన అలవాట్లతో అతను పడే ఇబ్బందులు అన్నీ ఫన్నీగా ఉంటాయి. ఈక్రమంలో వచ్చే ముద్దు ఎపిసోడ్.. దానికి 'జయం'లోని 'వీరి వీరి గుమ్మడి పండు' పాటను అనుకరిస్తూ శ్రీవిష్ణు చేసే హంగామా కడుపుబ్బా నవ్విస్తుంది. విరామ సమయానికి కథానాయిక తన జీవితంలోని సమస్యను హీరోకి రివీల్ చేయడంతో ద్వితీయార్ధంపై అంచనాలు ఏర్పడతాయి.

కథానాయిక వల్ల తన జీవితానికి ముప్పుందని తెలిశాక హీరో ఆమె ప్రేమ నుంచి బయట పడేందుకు చేసే ప్రయత్నాలు ఫన్నీగా ఉంటాయి. సమస్య తీవ్రత తెలిసీ తను పెళ్లికి సిద్ధపడ్డప్పటి నుంచి కథలో వినోదం రెట్టింపవుతుంది. ఈ క్రమంలో వచ్చే పెళ్లి చూపుల ఎపిసోడ్, పెళ్లి చుట్టూ నడిపిన డ్రామా కాలక్షేపాన్నిస్తుంది. పెళ్లి జరిగిన వెంటనే హీరో పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కొవడంతో కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఆ తర్వాత కథ కాస్త ఎమోషనల్‌గా మారుతుంది. కథానాయిక జీవితంలోని సమస్య చుట్టూ నడిపిన డ్రామా.. ఆ సమస్యకి మూల కారకుల్ని హీరో కనిపెట్టే తీరు అంతా సినిమాటిక్‌గా అనిపిస్తుంది. పతాక ఘట్టాలు ఊహకు తగ్గట్లే ఉన్నా ఫర్వాలేదనిపిస్తాయి.

**ఎవరెలా చేశారంటే..**

శ్రీవిష్ణు (Sree Vishnu) ఎప్పటిలాగే తనదైన విభిన్నమైన కామెడీ టైమింగ్, చిత్రమైన డైలాగ్ డెలివరీతో ప్రేక్షకుల్ని నవ్వించే ప్రయత్నం చేశారు. మనీషాగా నయన్ సారిక (Nayan Sarika) పాత్రని తీర్చిదిద్దిన తీరు బాగుంది. శ్రీవిష్ణుతో ఆమె కెమిస్ట్రీ చూడముచ్చటగా ఉంది. సినిమాలో అక్కడక్కడా విష్ణుతో పోటీగా నవ్వించే ప్రయత్నం చేసింది. జ్యోతిష్య శాస్త్రం తెలియకున్నా.. జాతకాలు చెప్పే సిద్ధాంతిగా శ్రీనివాస్ రెడ్డి అక్కడక్కడా నవ్వించారు. సినిమా అంతా సత్య కనిపించినా.. నవ్వించే ట్రాక్‌లు ఒకట్రెండే. గోపరాజు రమణ, బ్రహ్మాజీ, ప్రవీణ్, మురళీ శర్మ తదితరుల పాత్రలు పరిధి మేరకు ఉంటాయి. దర్శకుడు ఎంచుకున్న కథలో కొత్తదనం లేదు. కానీ, దాన్ని వినోదాత్మకంగా నడపడంలో సక్సెస్ అయ్యాడు. నిడివి తక్కువగా ఉండటం ఈ మూవీకి ప్లస్ పాయింట్. సాంకేతికంగా సినిమా బాగుంది.




బలాలు
+ శ్రీవిష్ణు మార్క్ వినోదం
+ యువతను ఆకర్షించే మీమ్ కంటెంట్
+ విరామ సన్నివేశాలు

బలహీనతలు
కొత్తదనం లేని కథ
ఊహలకు తగ్గట్లు సాగే కథనం.. చివరిగా: విష్ణు విన్యాసాలు అక్కడక్కడా నవ్విస్తాయి! గమనిక: ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

## "మళ్లీ డకౌట్ అయినా.. జట్టు నుంచి తప్పించబోమన్నారు"



వరుసగా విఫలమైనా సరే అవకాశాలు ఇచ్చిన ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్‌తోపాటు టీమ్‌కు తన హాఫ్ సెంచరీని అంకితం చేస్తున్నట్లు అభిషేక్ శర్మ తెలిపాడు. టీ20 ప్రపంచ కప్‌లో తాను ఆడిన తొలి మూడు మ్యాచుల్లోనూ డకౌట్ అయిన అభిషేక్.. జింబాబ్వేపై అర్ధశతకం చేసి ఫామ్ అందుకొన్నాడు. దీంతో తనకు ఎంతో రిలీఫ్‌గా ఉందని.. క్లిష్ట సమయాల్లో సహచరులు మద్దతుగా నిలిచారని అభిషేక్ తెలిపాడు.

అవును చాలా బాగుంది. నా కంటే సహచర క్రికెటర్లకే నాపై నమ్మకం ఎక్కువగా ఉంది. హాఫ్ సెంచరీ చేశాక ఎమోషన్‌కు గురయ్యా. అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించేందుకు ప్రయత్నించా. అయినా, నా బెస్ట్ ఇంకా రాలేదు. టీమ్‌ఇండియా డ్రెస్సింగ్ రూమ్ చాలా అద్భుతంగా ఉంది. మేమంతా ఓ టీమ్‌లా కాకుండా.. కుటుంబంలా ఉంటాం. అందుకే, నా నుంచి బెస్ట్ గేమ్ రావాలనేది వారి ఆకాంక్ష. ఆ రోజు తప్పకుండా వస్తుందని భావిస్తున్నా. నేనూ వేచి చూస్తున్నా'' అని అభిషేక్ తెలిపాడు.

అనుకున్నట్లు ఆరంభం లేదు..

''నేను టీ20 ప్రపంచ కప్‌లో అడుగు పెట్టేటప్పుడు నా ఆరోగ్యం కూడా అంత బాలేదు. అంతకుముందు ఆసుపత్రిపాలయ్యా. వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలో దేశం కోసం తొలి మ్యాచ్ ఆడేటప్పుడు మంచి ఆరంభం దక్కాలని కోరుకున్నా. కానీ, అలా జరగలేదు. అయినా సరే, జట్టు సభ్యుల నుంచి ఇప్పటికీ అదే సపోర్ట్. మరీ ముఖ్యంగా ప్రధాన కోచ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ నాపై చాలా నమ్మకం ఉంచారు. ఇంకో మ్యాచ్‌లో సున్నా చేసినా సరే పక్కన పెట్టేది లేదని.. జట్టు కోసం మరిన్ని విజయాలు అందించాలని చెప్పారు. జట్టుకు ఎంతో ముఖ్యమైన ప్లేయర్‌గా నన్ను భావించారు. అందుకే, జింబాబ్వేపై హాఫ్ సెంచరీని నేను నా జట్టు సహచరులు, కోచ్, కెప్టెన్‌కు అంకితం చేశా'' అని అభిషేక్ వెల్లడించాడు.

# రెండో వన్డేలోనూ భారత్ ఓటమి.. ఆసీస్‌దే సిరీస్





ఆస్ట్రేలియా గడ్డపై టీ20 సిరీస్‌ను నెగ్గిన భారత మహిళా జట్టుకు వన్డే సిరీస్‌లో మాత్రం పరాభవం తప్పలేదు. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఓడిన భారత్ మూడు వన్డేల సిరీస్‌ను కోల్పోయింది. హోబర్ట్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో టీమ్‌ఇండియాపై ఐదు వికెట్ల తేడాతో ఆసీస్ విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆస్ట్రేలియా 36.1 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 252 పరుగులు చేసి గెలిచింది. ఆసీస్ బ్యాటర్ జార్జియా వోల్ (101: 82 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్స్) సెంచరీతో తన జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. ఓపెనర్ ఫోయిబ్ లిట్‌చ్‌ఫీల్డ్ (80: 62 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్స్) దూకుడుగా ఆడేసింది. బెత్ మూనీ (31), అన్నాబెల్ సదర్లాండ్ (10), ఆష్లే గార్డెనర్ (15*) పరుగులు చేశారు. భారత బౌలర్లలో కాష్వీ గౌతమ్ 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్ ఒక వికెట్ తీశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా జార్జియా వోల్ నిలిచింది. తొలి మ్యాచ్‌లోనూ ఆసీస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇక నామమాత్రమైన మూడో వన్డే మార్చి 1న హోబర్ట్ వేదికగా జరగనుంది.

**వారిద్దరు రాణించినా..**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఓ మోస్తరు స్కోరునే చేయగలిగింది. ఓపెనర్ ప్రతీకా రావల్ (52), కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (54) హాఫ్ సెంచరీలు సాధించారు. స్మృతి మంధాన (31), రిచా ఘోష్ (22), కాష్వీ గౌతమ్ (25), క్రాంతి గౌడ్ (19) ఫర్వాలేదనిపించారు. జెమీమా రోడ్రిగ్స్ (15), దీప్తి శర్మ (1) అమన్ జోత్ కౌర్ (13) నిరాశపరిచారు. ఆసీస్ బౌలర్లలో ఆష్లే గార్డెనర్ 2, అన్నాబెల్ సదర్లాండ్ 2, అలానా కింగ్ 2.. స్కట్, నికోలా కారీ చెరో వికెట్ తీశారు.

## భారీ ఆధిక్యంలో జమ్ముకశ్మీర్.. రంజీ ట్రోఫీ విజేతగా నిలవడం లాంఛనమే!



తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్‌కు చేరిన జమ్ముకశ్మీర్ విజేతగా నిలిచేందుకు రంగం సిద్ధమైంది. కర్ణాటకతో ఫైనల్‌లో ఇప్పటికే తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జమ్ముకశ్మీర్ తన లీడ్‌ను 477 పరుగులకు తీసుకెళ్లింది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి జమ్ముకశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌లో 4 వికెట్ల నష్టానికి 186 పరుగులు చేసింది. ఖమ్రాన్ ఇక్బాల్ (94*) సెంచరీకి చేరువగా ఉండగా.. అతడికి తోడుగా సాహిల్ లోత్రా (16) క్రీజ్‌లో ఉన్నాడు. వీరిద్దరూ ఇప్పటికే ఐదో వికెట్‌కు 41 పరుగులను జోడించారు. అబ్దుల్ సమద్ (32) ఫర్వాలేదనిపించగా.. పరాస్ డోగ్రా (16), యవెర్ హసన్ (1), శుభమ్ పుందిర్ (1) విఫలమయ్యారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 2.. విజయ్‌కుమార్, శ్రేయస్ గోపాల్ చెరో వికెట్ తీశారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్ 584 పరుగులు చేయగా.. కర్ణాటక 293 పరుగులకే ఆలౌటైంది. దీంతో జమ్ముకు 291 పరుగుల తొలి ఇన్నింగ్స్ లీడ్ వచ్చింది. మరొక రోజు మాత్రమే ఆటకు సమయం ఉండగా.. మ్యాచ్ డ్రాగా ముగిసే అవకాశాలే ఎక్కువ. ఒకవేళ మ్యాచ్ డ్రాగా ముగిస్తే.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంలో ఉన్న జమ్ముకశ్మీరే విజేతగా నిలుస్తుంది. దీంతో ఆ జట్టు తొలిసారి టైటిల్‌ను గెలచుకోనుండటం దాదాపు లాంఛనమే.

జట్టు కోసం హుబ్లికి సీఎం అబ్దుల్లా

తొలిసారి రంజీ ట్రోఫీని కైవసం చేసుకోబోతున్న జమ్ముకశ్మీర్ జట్టు కోసం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా హుబ్లికి పయనమయ్యారు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఆయన పోస్టు పెట్టారు. ''మా జట్టు కోసం హుబ్లికి వెళ్తున్నాం. లక్షల మంది ప్రజలను ఆటగాళ్లు గర్వపడేలా చేశారు. మా జట్టును ప్రోత్సహించేందుకు శనివారం స్టాండ్స్‌లో కూర్చుని మ్యాచ్‌ను ఆస్వాదించేందుకు ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'' అని ఒమర్ పేర్కొన్నారు.

## విండీస్ బ్యాటింగ్ ఆర్డర్‌తో జాగ్రత్త: సునీల్ గావస్కర్

టీ20 ప్రపంచ కప్‌లో భారత్‌కు అత్యంత కీలకమైన మ్యాచ్ ఆదివారం ఉంది. సెమీస్‌కు చేరుకోవాలంటే తప్పక గెలవాల్సిన పోరు. మరోవైపు వెస్టిండీస్‌కూ ఇలాంటి పరిస్థితే. గెలిస్తేనే ముందుకు వెళ్తుంది. ఈ క్రమంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ టీమ్‌ఇండియాకు ఓ హెచ్చరిక చేశాడు. గత మ్యాచ్‌లో ఓడిన విండీస్‌ను తక్కువగా అంచనా వేయొద్దని సూచించాడు. ''దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో భారత బ్యాటింగ్ ఆర్డర్ దెబ్బతింది. దీంతో టాప్ ఆర్డర్‌లో కుడిఎడమ కాంబినేషన్‌ను అమలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. గత మ్యాచ్‌ల నంచి పాఠాలను నేర్చుకోవడం అత్యంత ముఖ్యం. ఇప్పుడు విండీస్‌తో సవాల్ భిన్నమైంది. వారు దేనిని తేలిగ్గా తీసుకోరు. వారి బ్యాటర్లంతా మంచి ఫామ్‌లో ఉన్నారు. విండీస్ బౌలర్లూ రిథమ్‌తో బౌలింగ్ చేస్తున్నారు. ఏదైనా పొరపాట్లు చేస్తే శిక్షించేందుకు సిద్ధంగా ఉంటారు. వారిని కట్టడి చేయాలంటే భారత్‌కు సరైన ప్లాన్ అవసరం. మరీ ముఖ్యంగా ఆ జట్టు బ్యాటింగ్‌పై ఓ కన్నేయాలి. తొలి బంతి నుంచే భారీ షాట్లకు దిగేస్తారు. ఆదివారం మ్యాచ్ తప్పకుండా సూపర్‌గా ఉండబోతోంది'' అని గావస్కర్ తెలిపారు.

**వరుణ్ ఏంటో చూపిస్తాడు: ఇర్ఫాన్**



గత రెండు మ్యాచుల్లో వరుణ్ చక్రవర్తి తన స్థాయికి తగ్గ బౌలింగ్ చేయలేకపోయాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే బ్యాటర్లు అతడిని రీడ్ చేసేశారు. అయితే, కోల్‌కతాలో వరుణ్‌ను ఆపడం విండీస్‌కు చాలా కష్టమని భారత మాజీ ఆటగాడు ఇర్ఫాన్ పఠాన్ వ్యాఖ్యానించాడు. ''విండీస్‌పై కోల్‌కతా వేదికగా వరుణ్ చక్రవర్తి విజృంభిస్తాడు. అతడికి పిచ్ బాగా అలవాటు. ఒక్కసారి లెంగ్త్‌ను అడ్జస్ట్ చేసుకుంటే చాలు. స్టంప్స్‌కు కాస్త దగ్గరగా బంతులేస్తే అతడిని ఆపడం ఎవరి వల్లా కాదు. ఆరంభంలోనే వికెట్ తీశాడంటే.. అత్యంత ప్రమాదకరంగా మారిపోతాడు'' అని ఇర్ఫాన్ విశ్లేషించాడు.

## క్రికెటర్ రింకు సింగ్ ఫ్యామిలీలో విషాదం.. తండ్రి ఖచంద్ర సింగ్ కన్నుమూత

టీమిండియా హార్డ్ హిట్టర్ రింకూ సింగ్ తండ్రి ఖచంద్ర సింగ్ ఇవాళ ఉదయం కన్నుమూశారు. గత కొంతకాలంగా ఆయన లివర్ క్యాన్సర్‌తో (Liver Cancer Stage 4) బాధపడుతున్నారు. గ్రేటర్ నోయిడాలోని యథార్థ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఖచంద్ర సింగ్ పరిస్థితి విషమించడంతో ఆయనను వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స అందించగా ఫలితం లేకుండా పోయింది. ప్రస్తుతం భారత్‌లో జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026 జట్టులో రింకూ సింగ్ సభ్యుడిగా ఉన్నారు. తండ్రి ఆరోగ్యం క్షీణించిందన్న వార్త తెలియగానే ఆయన చెన్నైలో జింబాబ్వేతో జరగాల్సిన మ్యాచ్ తర్వాత జట్టును వీడి హుటాహుటిన ఇంటికి చేరుకున్నాడు. టోర్నీలో అతడు మిగిలిన మ్యాచ్‌లకు ఆయన అందుబాటులో ఉంటారా లేదా అన్నది ఇంకా క్లారిటీ రాలేదు. కాగా, రింకూ సింగ్ తండ్రి ఖచంద్ర సింగ్ గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేసే సాధారణ కార్మికుడిగా పనిచేస్తూ తన కుమారుడిని క్రికెటర్‌గా తీర్చిదిద్దారు. తన విజయాల్లో తండ్రి ఖచంద్ర సింగ్ పాత్ర ఎంతో కీలకమైందని చాలా ఇంటర్వ్యూలో రింకు సింగ్ ప్రస్తావించారు.

# దూబె బౌలింగ్.. మరీ ఇంత దారుణంగానా?

చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup)లో జింబాబ్వేతో జరిగిన సూపర్ 8 మ్యాచ్‌లో టీమ్‌ఇండియా (Team India) 72 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. భారత్ 256 పరుగుల భారీ స్కోర్ చేసినా.. జింబాబ్వే గట్టిగానే పోరాడింది. ఈ మ్యాచ్‌లో రెండు ఓవర్లు బౌలింగ్ చేసిన శివమ్ దూబె (Shivam Dube) 23 ఎకానమీతో ఏకంగా 46 పరుగులిచ్చాడు. తన బౌలింగ్‌లో రెండు నోబాల్స్, 4 వైడ్స్ వేశాడు. ఓ బంతినైతే మ్యాచ్ జరుగుతున్న పిచ్ మీద కాకుండా.. పక్కనున్న పిచ్ పైకి అన్నట్లు వేశాడు. దీంతో బ్యాటర్‌తోపాటు, కామెంటేటర్లు కూడా ఆశ్చర్యపోయారు.

**12 కాదు 18!**

దూబె వేసింది రెండు ఓవర్లే అయినా.. ఎక్స్‌ట్రాలు కలిపితే మొత్తం 18 బంతులేశాడు. అంటే మూడు ఓవర్లతో సమానం. మొదటి ఓవర్‌లో 10, రెండో ఓవర్లో 8 బంతులు సంధించాడు. మొదటి ఓవర్లో 26 పరుగులిచ్చిన తర్వాత కూడా కెప్టెన్ సూర్య(Suryakumar Yadav).. దూబె మీద నమ్మకంతో రెండో ఓవర్ ఇచ్చాడు. అయినా ఆ ఓవర్‌లోనూ భారీగా పరుగులిచ్చాడు.

**వైవిధ్యమూ లేదు!**

శివమ్ దూబె మరీ వేగంగా బంతులేయలేదు! కనీసం బంతుల్లో వైవిధ్యమూ చూపలేకపోయాడు. ప్రతిసారీ ఆఫ్ వికెట్‌కు దూరంగా వేసే ప్రయత్నం చేశాడు. అవి చాలా వరకు వైడ్‌గా వెళ్లాయి. బ్యాటర్లు తనను రీడ్ చేసి ఆఫ్‌సైడ్ వైపు వచ్చి బౌండరీలు బాదుతున్నా.. లైన్ ఛేంజ్ చేయలేదు. ఆఖర్లో ఏదో ఒక వికెట్ దొరికింది కానీ.. అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ అయితే వేయలేదు! అలాగే ఫీల్డింగ్‌లోనూ నిర్లిప్తంగా కనిపించాడు. బౌండరీ దగ్గర ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో తన కళ్లముందే బంతి బౌండరీకి వెళుతుంటే.. కనీసం దాన్ని ఆపే ప్రయత్నమూ చేయలేదు.

**'అతడు ఆల్‌రౌండర్ కాదు..'**

శివమ్ దూబె కేవలం బ్యాటర్ మాత్రమే అని.. ఆల్‌రౌండర్ కాదని.. జింబాబ్వే మ్యాచ్‌కు ముందు టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. వాటిని జింబాబ్వే మ్యాచ్‌లో దూబె నిజం చేశాడు! 'శివమ్ దూబె.. అటాక్ చేస్తూ.. వికెట్లు తీసేందుకు ప్రయత్నించడం లేదు. నా దృష్టిలో అతడు బ్యాటర్ మాత్రమే. ఆల్ రౌండర్ కాదు. గంటకు కేవలం 120 కిలోమీటర్ల వేగంతో బంతులు సంధించే ఆల్‌రౌండర్‌తో మనకు పని లేదు. అతడు ఎక్కువగా పరుగులూ సమర్పించుకుంటున్నాడు' అని కైఫ్ అన్నాడు.

**'ఆత్మవిశ్వాసం లోపించింది'**

దూబె బౌలింగ్‌లో ఆత్మవిశ్వాసం లోపించిందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. 'దూబె చివరి మూడు మ్యాచుల్లో ఏడు ఓవర్లు బౌలింగ్



చేసి, 113 పరుగులు సమర్పించుకున్నాడు. అతడి బౌలింగ్‌లో ఆత్మవిశ్వాసం కొరవడింది' అని ఆకాశ్ చోప్రా విశ్లేషించాడు. 'ఆరో బౌలర్ రెండు ఓవర్లలో ఏకంగా 46 పరుగులు సమర్పించుకున్నాడు. అతడు మరోసారి బౌలింగ్ చేస్తే భారత్ ఇబ్బంది పడుతుంది' అని ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ సైతం అన్నాడు.

టీ20 ప్రపంచకప్‌లో ప్రస్తుతం టీమ్‌ఇండియా చావోరేవో తేల్చుకునే దశలో ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో దూబె బ్యాటింగ్‌లో తన ఫామ్‌ను కొనసాగిస్తూనే.. బౌలింగ్‌లో రిథమ్‌ను అందుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా అతడు లైన్ అండ్ లెంగ్త్, వైవిధ్యంపై దృష్టి పెట్టాలని క్రికెట్ విశ్లేషకులు సూచిస్తున్నారు.

## ఆలస్యంగా ఐపీఎల్ 2026 ప్రారంభం.. ఎప్పుడంటే?

ఐపీఎల్ 2026 సీజన్ షెడ్యూల్ మారుతోంది. తొలుత ప్రకటించినట్లుగా మార్చి 26న కాకుండా.. రెండు రోజుల తర్వాత 19వ సీజన్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. అంటే మార్చి 28న మొదలై ఫైనల్ మే 31న జరుగుతుంది. కొత్త సీజన్‌కు ముందు ఆటగాళ్లకు, ఫ్రాంచైజీలకు కాస్త సమయం ఇచ్చేందుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీనిపై ఐపీఎల్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాబోయే వారంలో బీసీసీఐ నుంచి ప్రకటన ఉండొచ్చని క్రికెట్ వర్గాలు తెలిపాయి. పూర్తిస్థాయి షెడ్యూల్, వేదికలను కూడా అప్పుడే వెల్లడించే అవకాశం ఉంది.

**ఆలస్యం అందుకేనా?**

సాధారణంగా నెల రోజుల ముందే ఐపీఎల్ సీజన్ షెడ్యూల్‌ను కమిటీ ప్రకటిస్తూ ఉంటుంది. కానీ, ఈసారి కాస్త ఆలస్యమయ్యే అవకాశం ఉంది. దానికి కారణం ఎన్నికలు. అసోం, పశ్చిమ్ బెంగాల్, తమిళనాడు ఎన్నికలకు సంబంధించి ఎన్నికల తేదీలపై స్పష్టత రాలేదు. దీంతో బీసీసీఐ కూడా వేచి చూస్తోంది. ఆయా వేదికల్లో కోల్‌కతా నైట్‌రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లు ఉండగా.. రాజస్థాన్ రాయల్స్‌కు గువాహటి రెండో హోంగ్రౌండ్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఎన్నికలు, మ్యాచ్‌ల తేదీలు క్లాష్ కాకుండా.. ఉండేందుకే ఆలస్యమవుతోందని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. అవసరమైతే రెండు దశల్లో షెడ్యూల్‌ను రిలీజ్ చేసే అవకాశం లేకపోలేదు.



**కొత్త జెర్సీతో లఖ్‌నవూ**

గత సీజన్‌లో దారుణమైన ప్రదర్శనతో నిరాశపరిచిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తన అదృష్టాన్ని మార్చుకొనేందుకు ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా కొత్త జెర్సీతో బరిలోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికే కెప్టెన్ రిషభ్ పంత్, మార్‌క్రమ్ ఈ జెర్సీలను ధరించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.